# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక





## కరోనా కలవరం

అప్రమత్తమైన ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు 2 లో..


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 94 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 25 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 94 25-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


### కేంద్రం, రాష్ట్రాలు టీం ఇండియాలాగా

## కలిసి పనిచేస్తే.. ఏ లక్ష్యం అసాధ్యం కాదు : మోడీ



న్యూఢిల్లీ మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

%న్యూఢిల్లీ : కేంద్రం, రాష్ట్రాలు టీం ఇండియాలాగా కలిసి పనిచేస్తే.. ఏ లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని ప్రధాని మోడీ శనివారం అన్నారు. నేడు ఢిల్లీలో మోడీ అధ్యక్షతన నీతి అయోగ్ 10వ పాలకమండలి సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో 'మనం అభివృద్ధి వేగాన్ని పెంచాలి. కేంద్రం, అన్ని రాష్ట్రాలు కలిసి వచ్చి టీం ఇండియాలాగా కలిసి పనిచేస్తే ఏ లక్ష్యం అసాధ్యం కాదు అని చెప్పినట్లు నీతి అయోగ్ ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడించింది. వికసిత్ భారత్ 2047 థీమ్‌తో ఈ కౌన్సిల్ సమావేశం జరిగినట్లు మోడీ వెల్లడించారు. ప్రతి భారతీయుడి లక్ష్యం వికసిత్ భారత్, ప్రతి రాష్ట్రం వికసిత్ అయినప్పుడు.. భారత్ కూడా వికసిత్ అవుతుంది. ఇది 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష అని మోడీ అన్నారు.

కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ నితిఅయోగ్ సమావేశానికి రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు హాజరవ్వాలి. కానీ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా ఈ కౌన్సిల్‌కి హాజరవ్వలేదు.

## 2029 నాటికి ఏపీలో పేదరికం లేకుండా చేస్తాం : చంద్రబాబు

- ప్రధాని మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ గవర్నింగ్ బాడీ సమావేశం
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్రపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్
- ఇప్పటి వరకు సాధించినవి, భవిష్యత్ లక్ష్యాలు వివరణ
- చంద్రబాబు ప్రజెంటేషన్ కు మోదీ ప్రశంసలు
- అన్ని రాష్ట్రాలు అనుసరించాలని పిలుపు

న్యూఢిల్లీ మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీలో 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నేడు ప్రారంభమైంది. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన గవర్నర్‌లు, సీఎంతో ప్రధాని మాట్లాడారు. ఈ సమావేశంలో వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై చంద్రబాబు నివేదిక ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించి, ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ నీతి ఆయోగ్ ప్రసంగాన్ని ఏపీ సీఎం ప్రారంభించారు. అనంతరం ఆయన స్వర్ణాంధ్ర సాకారంపై పవన్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన

- తరువాయి 2లో..







## కారు-లారీ ఢీ.. ఐదుగురు దుర్మరణం



కడప, మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాయచోటి- కడప రహదారిలో శనివారం మరో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అయిదుగురు అక్కడిక్కడే ప్రాణాలు వదిలారు. కడప గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో ఈ ఘోర దుర్ఘటన శనివారం చోటు చేసుకుంది. ఘాట్ రోడ్డులో వెళ్తున్న కారుపై ఓ లారీ పడిపోయింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న అయిదుగురు మృతిచెందారు. గువ్వల చెరువు ఘాట్‌లోని నాలుగో మలుపు వద్ద భా రీ గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి ఒక్కసారిగా కారుపై

- తరువాయి 2లో..



## విజయవాడలో.. బాంబు కలకలం

- బెజవాడకు బాంబు బెదిరింపు
- కలవరపడ్డ నగర ప్రజలు
- కంట్రోల్ రూమ్ కి అగంతుకుడి ఫోన్ కాల్..
- అప్రమత్తమైన పోలీసులు%ా.
- పోలీసు ఆధీనంలో బీసెంట్ రోడ్డు..
- షాపులు మూసి, విస్తృత తనిఖీలు..
- నాలుగు బృందాలుగా.. డాగ్ స్క్వేర్ తో తనిఖీలు..
- మూడు గంటల పాటు ఉత్కంఠ%ా
- ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న వైనం..
- ఫోన్ చేసిన ఆగంతకడి కోసం వేట

అమరావతి మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వందల సంఖ్యలో షాపులు లెక్కలేనంతమంది హెకర్లు.. వేల సంఖ్యలో 2 లో..






## సినిమా థియేటర్ల బంద్ లేదు

### తెలుగు ఫిల్మ్ ఛాంబర్

### థియేటర్స్ బంద్ పై వెనక్కి తగ్గిన ఎగ్జిబిటర్స్

అమరావతి మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్ల బంద్ లేదని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ స్పష్టం చేసింది. శనివారం ఫిల్మ్ ఛాంబర్ సమావేశంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో కలిసి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమాలోచనలు జరగ్గా, అనంతరం మీడియాతో ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడారు. థియేటర్ల బంద్‌పై వదంతులు వ్యాపించాయని అన్నారు. " బంద్ గురించి చర్చలు జరగకపోతే ఆ దిశగా అడుగులు పడతాయని మాత్రమే మేము చెప్పాం. కానీ థియేటర్ల బంద్ ఖాయం అనేలా ప్రచారం

- తరువాయి 2లో..

### పోలీస్ కస్టడీలో వల్లభనేని వంశీకి

## తీవ్ర అస్వస్థత

విజయవాడ, మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గన్నవరం మాజీ శాసనసభ్యుడు, వైసీపీ నేత వల్లభనేని వంశీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన కంకిపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. నకిలీ ఇళ్ల పట్టాలకు సంబంధించిన కేసులో వంశీ కంకిపాడు పోలీసుల కస్టడీలో ఉన్నారు. ఇప్పటికే శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న వంశీకి%ొ% పోలీసుల కస్టడీలో ఆరోగ్య పరిస్థితి అకస్మాత్తుగా క్షీణించింది. దీంతో ఆయన తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పరిస్థితిని గమనించిన పోలీసులు వెంటనే స్పందించి, ఆయన్ను కంకిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. వంశీ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఆయన భార్య పంకజశ్రీ వెంటనే కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అలాగే, కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని కూడా ఆసుపత్రికి వచ్చి వంశీ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వంశీ కుటుంబ సభ్యులు ఆయన ఆరోగ్యం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**మెరుగైన వైద్య సేవలు అందించాలి**

ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ, వల్లభనేని వంశీకి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల దృష్ట్యా, కంకిపాడు ఆసుపత్రి నుంచి మెరుగైన సౌకర్యాలున్న ఎయిమ్స్ వంటి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

### ఇద్దరు టిడిపి వర్గీయులు

## దారుణ హత్య



పల్నాడు జిల్లా మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లాలోని మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెలుగుదేశం వర్గీయులు హత్యకు గురయ్యారు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని కారుతో ప్రత్యర్థులు ఢీకొట్టారు. కిందపడిన ఇద్దరిని గొడ్డళ్లతో ప్రత్యర్థులు నరికివేశారు. మృతులు గుండ్లపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులుగా గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో తోట చంద్రయ్యను వైసీపీ నేతలు నరికి చంపిన విషయం తెలిసిందే. తాజాగా అదే గుండ్లపాడుకు చెందిన ఇద్దరు టీడీపీ వర్గీయులు హత్యకు గురయ్యారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

### కశ్మీర్ విద్యార్థులు నేరస్థులా?

ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన మారణకాండను యావద్దేశం గర్హించింది. పర్యాటకులు ఏ మతం వారో పట్టిపట్టి ఆరా తీసి ఉగ్రవాదులు కాల్పులు జరపడం దేశం మొత్తం ముక్తకంఠంతో ఖండించింది. ఇప్పుడు అదే రీతిలో కశ్మీర్‌లోయ కాకుండా బయట ఉత్తరాది ప్రాంతాల్లో కశ్మీరీలపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. కశ్మీరీ అయితే చాలు వారి దాడులకు బలైనట్టే. ఈ దాడులకు పాల్పడుతున్న వారికి ఉగ్రవాదులకు తేడా ఏం లేదు. పహల్గాం ఉగ్రదాడితో ఎలాంటి సంబంధం లేకపోయినా, విద్యార్థులను, వ్యాపారులను నేరస్థులుగా ఇతర ప్రాంతాల్లో అనుమానించడం, దాడులు చేయడం తరచుగా జరుగుతున్నాయి. పహల్గాం సంఘటన జరిగిన ఆరురోజుల్లోనే ఈవిధంగా దేశం మొత్తం 17 సంఘటనలు జరిగాయి. ఎక్కువగా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో ఒక వర్గానికి చెందిన మితవాద వర్గాల దురుసుతనమే ఈ సంఘటనల వెనుక కనిపిస్తోంది. పంజాబ్‌లో కశ్మీర్ విద్యార్థులను క్యాంపస్‌లోనే కర్రలతో, పదునైన ఆయుధాలతో దాడి చేశారు. ఉత్తరాఖండ్‌లో కాలేజీలనుంచి వెళ్లిపోవాలని బెదిరించారు.

ఢిల్లీలో జామియా, మిలియా ఇస్లామియా విద్యార్థిపై దౌర్జన్యం చేశారు. హిమాచల్‌ప్రదేశ్, ముస్సోరీలో కశ్మీరీ శాలువాలు విక్రయించే వ్యాపారులపై దాడులు జరిగాయి. కశ్మీర్‌లో ఏదైనా హింస జరిగితే కశ్మీరీలంతా అనుమానితులవుతుండడం పరిపాటిగా సాగుతోంది. పహల్గాం ఉగ్రదాడి బాధాకరమైన వాస్తవాన్ని వెల్లడించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న కశ్మీర్ విద్యార్థులకు భద్రత గాలిలో దీపంలా తయారైంది. దేశంలో వీరికి భద్రత కల్పించే పటిష్టమైన, వ్యవస్థాపరమైన యంత్రాంగం లేదు. అలాగని వారి భద్రతను ప్రజల భావోద్వేగాలతో మారుతున్న అభిప్రాయాలకు విడిచిపెట్టకూడదు. పహల్గాం వంటి దాడులకు పాల్పడే ముష్కరుల లక్ష్యం కేవలం చంపడమే కాదు, సమాజాన్ని చీల్చడం, ప్రజల్లో నమ్మకాన్ని పోగొట్టడం, సామాజిక సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడం, సామాజిక వర్గాల్లో అనుమానాలను ప్రేరేపించడం. ఈ నేపథ్యంలో మనం స్పష్టంగా తెలుసుకోవలసింది కశ్మీరీ విద్యార్థులను హింసించడం దేశభక్తిలో భాగం కాదు.

దేశాన్ని అంతర్గతంగా చీల్చాలనుకుంటున్న వారికి విద్యార్థులను దాసోహం చేయడమే అవుతుంది. ఈ హింసాకాండలు కొత్తేమీ కావు. కశ్మీర్ లోయలో ఏదైనా హింసాత్మక సంఘటన జరిగినా లేదా సైనికులు ముష్కరులకు బలైపోయినా, కశ్మీరీ విద్యార్థులకే తరచుగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. చాలా మంది విద్యార్థులు పేదరికంతోను, సంఘర్షణలతోను సతమతమవుతున్నా ఉన్నత చదువుల ద్వారా చక్కని భవిష్యత్ కోసం నిరీక్షిస్తున్నారు. వీరికి అన్ని విధాలా సహకారం అందడానికి బదులు కేవలం కశ్మీరీ అయినందున నేరస్థులుగా అనుమానించడం శోచనీయం. యూనివర్శిటీలు, ఇతర విద్యాసంస్థలు వీరిని పీడించే బందిఖానాలుగా మారుతుంటే పాలనా యంత్రాంగాలు పట్టించుకోవడం లేదు. కాలేజీ నిర్వాహకులు, చట్టాలు, పౌరసమాజం వారిని దేశసంక్షోభ సమయాల్లో బలిపశువులు కాకుండా చూడాలి. వారి ఫిర్యాదులను పరిష్కరించే అధికారులను నియమించాలి.

వివక్షకు తావు లేని విధానాలు అమలు చేయాలి. స్థానిక పోలీస్‌ల సహకారంతో వారికి మూకుమ్మడి దాడులనుంచి రక్షణ కల్పించాలి. విధానాలకు అతీతంగా వారి మానసిక క్షోభను నివారించే ప్రయత్నం చేయాలి. క్లిష్ట పరిస్థితుల్లో ఈ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు, మానసిక నైరాశ్యానికి గురవుతున్నారు. దేశం పట్ల వారు తమ విధేయతను నిరూపించుకునేలా అవకాశం కల్పించాలి. దేశంలోని మరే ఇతర విద్యార్థి వర్గాలకు ఇలాంటి దుస్సంఘటనలు ఎదురు కాకుండా చూడాలి. ఇలాంటి చర్యలు తీసుకోకుంటే విద్యార్థుల్లో భయం పెరిగి, తమ గుర్తింపు ఎవరికీ తెలియకుండా కాలేజీ క్యాంపస్‌ల్లో దాక్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక సుదీర్ఘకాల ఆందోళనలో మగ్గిపోవలసి వస్తుంది. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జ్ఞాపకాలను నిజంగా మనం మన్నించాలనుకుంటే మతపరమైన ప్రతీకార ఉచ్చులో మనం ఇరుక్కోకూడదు. సంస్థాగత సంకల్పానికి మనం స్పందించాలి. అంతర్గతంగా సాగుతున్న ఈ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలి.

క్లిష్టపరిస్థితుల్లో కశ్మీరీ విద్యార్థులకు ఎక్కడా, ఏ విద్యాసంస్థల్లోనూ వేధింపులు, బెదిరింపులు, దాడులు ఎదురు కాకుండా ఒక జాతీయ స్థాయి విద్యావిధానాన్ని అమలు చేయడం తప్పనిసరి. సామాజిక, సామరస్య వాతావరణాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక హింసాత్మక సంఘటన చాలన్న ముష్కరుల జోస్యానికి అవకాశం ఇవ్వరాదు. హింసకు మన సమాధానం ఐక్యత తప్ప పగ, ప్రతీకారం కారాదు. మనబలం కరుణే తప్ప ప్రతిదాడి కారాదు. కశ్మీరీ విద్యార్థులు కోరుకునేది మన నుంచి అనుమానం కాదు, మనం అందించే సంఘీభావం. ఇప్పుడు మనకు కావలసింది కశ్మీరీ విద్యార్థులకు పటిష్టమైన భద్రతా చర్యలు కల్పించడం. అమాయకులైన యువత నేరారోపణకు బలికాకుండా వారిని రక్షించుకోవడానికి మనం కృతనిశ్చయులమై ఉండాలి. పహల్గాం దాడి సమయంలో వివిధ ప్రాంతాల పర్యాటకులను కులమతాలకు అతీతంగా ఆదరించి అక్కున చేర్చుకున్నది కశ్మీర్ ముస్లింలే అన్న వాస్తవాలను మరిచిపోరాదు. బాధితులకు ఆపన్నహస్తం అందించిన కశ్మీర్ లోయపైన, అక్కడి ప్రజలపైన, విద్యార్థులపైన ఎక్కడైనా వివక్ష చూపించడమంటే మనకు మనం శత్రువులం కావడమే.

# కరోనా కలవరం

## అప్రమత్తమైన ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు

- దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- భారత్‌లో ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7 కొత్త వేరియంట్ల గుర్తింపు
- ఢిల్లీ, ఏపీ, కర్ణాటకలో ఆసుపత్రుల సన్నద్ధతకు ప్రభుత్వాల చర్యలు
- ఆసియా దేశాల్లో జేఎన్.1 వేరియంట్‌తో అధిక వ్యాప్తి
- లక్షణాలు స్వల్పమే, ఆందోళన వద్దంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, అమరావతి మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కరోనా మహమ్మారి పూర్తిగా అంతమైందని భావిస్తున్న తరుణంలో, దేశంలో మళ్లీ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నాయి. భారత్‌లో కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ. 1. 8. 1, ఎల్‌ఎఫ్. 7లను గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం (ఇన్సాకాగ్) శనివారం ప్రకటించింది. ఎన్‌బీ. 1. 8. 1 రకం కేసు ఏప్రిల్ నెలలో వెలుగు చూడగా, ఎల్‌ఎఫ్. 7 వేరియంట్‌కు సంబంధించిన నాలుగు కేసులు మే నెలలో తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో నమోదైనట్లు సంస్థ తెలిపింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కొత్తగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఢిల్లీలో మూడేళ్లలో తొలిసారిగా 23 మందికి వైరస్ సోకింది. దీంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. అయితే, కేసులు నమోదవుతున్నప్పటికీ, వ్యాధి తీవ్రత తక్కువగానే ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల వెల్లడించింది. అయినప్పటికీ, పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపింది.



**అంతర్జాతీయంగా పెరుగుతున్న వ్యాప్తి**

ఇటీవలి కాలంలో ఆసియా దేశాలైన హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి అధికంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. జేఎన్. 1 వేరియంట్, దాని ఉపరకాలే ఈ వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా జేఎన్. 1 ఉపరకాలైన ఎల్‌ఎఫ్. 7, ఎన్‌బీ. 1. 8 వేరియంట్ల వ్యాప్తి ఎక్కువగా ఉందని సింగపూర్ ఆరోగ్యశాఖ ఇటీవల వెల్లడించింది. బాధితుల్లో జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, వారు నాలుగు రోజుల్లోనే కోలుకుంటున్నారని వైద్య నిపుణులు తెలియజేశారు.

**ప్రభుత్వాల చర్యలు, నిపుణుల సూచనలు**

ఢిల్లీలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్లు, వ్యాక్సిన్ల లభ్యతను సరిచూసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను నమోదు చేయాలని కూడా సూచించింది. వైరస్ వేరియంట్లలో వస్తున్న మార్పులు, ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గడం ప్రస్తుత వ్యాప్తికి కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

## పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల పథకం.. అభ్యంతరం తెలిపిన తెలంగాణ

హైదరాబాద్ మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రతిపాదనలపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ గోదావరి బోర్డుతోపాటు, పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాశారు. కేంద్ర జల సంఘం అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని, దీనివల్ల గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వాటిల్లుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం సబబు కాదని అన్నారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకూ నీటి లభ్యత లేదంటూ ఏపీ ప్రభుత్వం అభ్యంతరం చెబుతోందని, మరోవైపు ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్ స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం సబబు కాదని అనిల్‌కుమార్ లేఖలో పేర్కొన్నారు. డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సీడబ్ల్యూసీ అనుమతులకు విరుద్ధమని తెలంగాణ వాదిస్తోంది. సీడబ్ల్యూసీ వెంటనే జోక్యం చేసుకొని ఏపీని అడ్డుకోవాలని అనిల్‌కుమార్ కోరారు. పోలవరం నుంచి ఎత్తిపోతల చేపట్టకుండా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు కూడా ఇది విరుద్ధంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టుపై ఏపీ ముందుకు వెళ్లకుండా నిలువరించాలని కోరారు.



## 2029 నాటికి ఏపీలో పేదరికం లేకుండా చేస్తాం : చంద్రబాబు

ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే వివిధ అంశాలను తన ప్రజెంటేషన్‌లో ప్రస్తావించారు రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. విశాఖకు గ్లోబల్ హంగులు అద్దేలా నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, గోదావరి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని ఈ సందర్భంగా ఏపీ సీఎం కోరారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఒప్పందం.. కర్నూలులో డ్రోన్ సిటీ ప్లాన్లను ప్రజెంటేషన్‌లో ప్రత్యేకంగా వివరించారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ ఏఐ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్టు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్టు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు బిడ్డల నిబంధన రద్దు చేసినట్టు ప్రజెంటేషన్‌లో సీఎం వివరించారు. మాతృత్వ సెలవులను 180 రోజులకు పెంచినట్టు సీఎం వెల్లడించారు. ప్రతి జిల్లా, నియోజకవర్గంలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు, రాష్ట్ర పురోగతిని కొలిచేందుకు 523 కీలక సూచికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త వచ్చేలా ప్రభుత్వ విధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ పార్క్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 2029 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. పీ4 మోడల్ ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా సహాయం చేస్తున్నామని.. అర్బన్ రూరల్ సినర్జీ మోడల్ లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తన ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు.

**చంద్రబాబు సూచనలకు మోదీ ప్రశంసలు..**

సీఎం ప్రజెంటేషన్‌లో వివిధ అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని ప్రధాని సూచించారు. చంద్రబాబు ప్రజెంటేషన్‌కు సమావేశంలో పెద్ద ఎత్తున ప్రశంసలు వెల్లువెత్తాయి.

## కారు-లారీ ఢీ.. ఐదుగురు దుర్మరణం

ఒరిగి పోవటంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పెద్ద శబ్ధంతో ప్రమాదం జరగడంతో స్థానికులు గమనించి వాహనాల వద్దకు పరుగులు తీశారు. పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులకు బయలకు తీసేందుఉ అగ్నిమాపక సిబ్బంది. పోలీసులు, స్థానికులు శ్రమించారు. బద్వేలు మండలం చింత పుట్టయ్య పల్లిలో ఆదివారం జరిగే జాతరలో పాల్గొనేందుకు ఏడుగురు కుటుంబ సభ్యులు బెంగళూరులో బయలుదేరారు. ప్రమాద స్థలిలో నలుగురు అక్కడిక్కడే మృతి చెందారు. రాయచోటి ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు ప్రాణాలు వదిలారు. ఈ దుర్ఘటనలో చింత పుట్టయ్యపల్లి బసినేని శ్రీకాంత్ రెడ్డి, భార్య శిరీష , సమీప బంధువులు మేకవానిపల్లి గ్రామానికి చెందిన స్వర్ణ , గంగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన శశి , వీరిబిడ్డలు పిల్లలు హర్షిణి, రిషి మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు.

**మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి..**

కడప జిల్లా సీకే దిన్నె మండల గువ్వలచెరువు ఘాట్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అయిదుగురు దుర్మరణం చెందడంపై ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రాయచోటి నుంచి కడపకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకోవడం దురదృష్టకరం అన్నారు. ప్రమాదంలో చిన్నారి సహా ముగ్గురు మహిళలు మరణించడం కలచివేసింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఈ ఘటన బాధాకరం: మంత్రి రాంప్రసాద్**

కడప జిల్లా గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో లారీ, కారు ఢీకొన్న ఘటన బాధాకరమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అయిదుగురి మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రోడ్డు ప్రమాదాలు తీరని విషాదాన్ని నింపుతున్నాయని.. ప్రయాణికుల రోడ్డు భద్రత నియమాలు విధిగా పాటించాలని అన్నారు. రోడ్డు ప్రయాణాలలో భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**విచారం వ్యక్తంచేసిన మంత్రి సవిత**

కడప జిల్లాలో జరిగిన ప్రమాదంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రమాదంపై ఎస్పీ అశోక్ కుమార్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. దుర్ఘటనపై ఆరా తీశారు. మృతులను గుర్తించి బాధిత కుటుంబాలకు సత్వర సమాచారం ఇవ్వాలని.. ఎస్పీ అశోక్ కుమార్‌కు మంత్రి సవిత ఆదేశించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి ఓ కుంటుబం కారులో కడపకు బయలుదేరింది. ఇదే మార్గంలో రామాపురం దాటిన తరువాత ప్రమాదకరమైన గువ్వలచెరువు ఘాట్ ప్రారంభం అవుతుంది. ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా, వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఘాట్ రోడ్డులో ఒక పక్కన ఉన్న గోడవైపు కారు దూసుకుని పోయింది. లారీ కూడా కారుపై పడిపోయింది. దీంతో కారు నుజ్జునుజ్జుగా నలిగిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు కుటుంబ సభ్యులు ప్రాణాలు కల్పోయారని సమాచారం. లారీ కింద నలిగిపోయిన కారును, అందులోని మృతదేహాలను వెలికి తీయడానికి వాహనాల్లో వెళుతున్న వారితో పాటు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఘాట్ రోడ్డులో జరిగిన ఈ ప్రమాదంతో భారీగా వాహనాలు నిలియిపోయాయి. లారీ కింద నలిగిన కారులో నాలుగేళ్ల పాప మృత్యుంజయురాలిగా ఉండడం గమనించిన ప్రయాణికుల సహకారంతో ఆ పాపను వెంటనే కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం అందింది.

## విజయవాడలో.. బాంబు కలకలం

కొనుగోలుదారులు నడవడానికి కూడా వీలు లేనంత వ్యాపారం.. ఇది బెజవాడ నగరంలోని బీసెంట్ రోడ్డు పరిస్థితి. నిత్యం కిటకిటలాడే బీసెంట్ రోడ్డు కు బాంబు బెదిరింపు రావడంతో నగరవాసులంతా కలవరపాటికి గురయ్యారు. శనివారం ఉదయం పోలీస్ కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసినవా అగంతకుడు బీసెంట్ రోడ్ లో బాంబు ఉన్నట్టు, మరి కొంత సమయంలో బాంబు పేలుతుందని చెప్పి ఫోన్ కట్ చేయడంతో, నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. నాలుగు బృందాలుగా రంగంలోకి దిగిన పోలీసులు బీసెంట్ రోడ్డు మొత్తాన్ని బాంబు కోసం జెల్లెడు పట్టడం ప్రారంభించారు. ఇటు బందర్ రోడ్డు నుండి అటు ఏలూరు రోడ్డు వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు విస్తీర్ణం ఉన్న బీసెంట్ రోడ్డును తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు, షాపులన్నింటినీ క్లోజ్ చేసి అటుగా స్థానికులను ఎవరిని రానివ్వకుండా అన్ని రహదారులను మూసివేశారు. పోలీసు ప్రత్యేక బృందాలు, మెటల్ డిటెక్టర్లు, డాగ్ స్క్వాడ్ తో బీసెంట్ రోడ్డు మొత్తం గాలించారు. బీసెంట్ రోడ్డులో ఎక్కువ సంఖ్యలో తోపుడు బండ్లు, హ్యాకర్ షాపులు ఉండడంతో వాటన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు . సుమారు మూడు గంటల పాటు అన్ని ప్రాంతాలను అణువణువునా తనిఖీ చేసిన పోలీసులు చివరకు ఎటువంటి. బాంబు లభించకపోవడంతో ఇది ఒక ఫేక్ కాల్ గా గుర్తించారు. ఈ పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ కి కాల్ చేసిన అగంతకుడు సమాచారం కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. అయితే మూడు గంటల పాటు బీసెంట్ రోడ్డు మొత్తం పోలీసులు జల్లెడ పడుతుండడం ఏం జరుగుతుందో తెలియక నగరవాసులంతా ఉత్కంఠతకు గురయ్యారు.

## సినిమా థియేటర్ల బంద్ లేదు

జరగడం తప్పు. ఒక సినిమా నేపథ్యంలో థియేటర్లు బంద్ అవుతాయంటూ వార్తలు రావడం పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. చిత్ర పరిశ్రమలో అనేక సమస్యలున్నాయి. అవన్నీ పరస్పర సంబంధం కలిగినవే. వాటిని ఒకదానికొకటి కలపకుండా ఒక్కొక్కటిగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా థియేటర్లలో పర్సంటేజీ విధానంపై గత కొన్నేళ్లుగా చర్చలు జరగలేదు. ప్రస్తుతం మాత్రం ఈ అంశంపై చర్చలు ప్రారంభమయ్యాయి. మూడు వర్గాల నుంచి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఈనెల 30న జరగనున్న సమావేశంలో ఆ కమిటీకి సభ్యులుగా ఎవరుంటారన్నది ఖరారు చేస్తాం. వారి ఆధ్వర్యంలో రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసి, సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేస్తాం " అని దామోదర ప్రసాద్ వివరించారు. మీడియా సభ్యులను ఉద్దేశించి థియేటర్ల బంద్ గురించి అనధికారిక వర్గాల సమాచారం ఆధారంగా వార్తలు రాయవద్దని, అధికారికంగా ఫిల్మ్ ఛాంబర్ నుంచి వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని దామోదర ప్రసాద్ సూచించారు. " చిత్ర పరిశ్రమలోని అన్ని వర్గాలతో సమావేశాలు జరిపి వీలైనన్ని సమస్యలను ఇంటర్నల్‌గా పరిష్కరించేందుకు కటిషి చేస్తామన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చలు జరపుతామనీ, ఈ క్రమంలో ఎపి మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసే యోచనలో ఉన్నామని వెల్లడించారు.

# కొత్త కొవిడ్ వేరియంట్లు..
# వేగంగా వ్యాప్తి..!

## తీవ్రత ఎంత? నిపుణుల మాట ఇదే

- **వేగంగా వ్యాపిస్తున్న కొవిడ్ కొత్త ఉపరకాలు ఎల్ఎఫ్.7, ఎన్బీ.1.5**
- **సింగపూర్, హాంగ్‌కాంగ్‌తో పాటు భారత్‌లోనూ పెరుగుతున్న కేసులు**
- **రోగ నిరోధక శక్తి తగ్గడం, వేరియంట్ల వ్యాప్తి తీరు కేసుల పెరుగుదలకు కారణం**
- **జ్వరం, గొంతు నొప్పి, దగ్గు వంటి సాధారణ లక్షణాలు**
- **తీవ్రత తక్కువ, ఆందోళన అవసరం లేదంటున్న వైద్య నిపుణులు**
- **మాస్కులు, వ్యక్తిగత శుభ్రత వంటి జాగ్రత్తలు పాటించడం ముఖ్యం**



దేశంలో మరోసారి కరోనావైరస్ కొత్త ఉపరకాల రూపంలో కలకలం సృష్టిస్తోంది. ముఖ్యంగా జేఎన్.1 వేరియంట్ నుంచి పుట్టుకొచ్చిన ఎల్ఎఫ్.7, ఎన్బీ.1.5 అనే ఉపరకాలు వేగంగా వ్యాప్తి చెందుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సింగపూర్, హాంగ్‌కాంగ్‌లలో కేసుల పెరుగుదల అనంతరం, భారత్‌లోని ముంబై, చెన్నై, అహ్మదాబాద్ వంటి నగరాల్లో కూడా కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ కొత్త వేరియంట్ల వ్యాప్తి తీరు, వాటి ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**కొత్త ఉపరకాల వ్యాప్తికి కారణాలు**

ప్రస్తుతం కొవిడ్ కేసుల పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలున్నాయి. మొదటిది, ఈ కొత్త ఉపరకాలు (ఎల్ఎఫ్.7, ఎన్బీ.1.5) అధిక వ్యాప్తి సామర్థ్యం కలిగి ఉండటం. రెండోది, ప్రజలలో కాలక్రమేణా తగ్గుతున్న రోగనిరోధక శక్తి. గతంలో కొవిడ్ బారిన పడినవారిలో లేదా వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఏర్పడిన రోగనిరోధక శక్తి సహజంగానే తగ్గుముఖం పట్టడం వల్ల ఈ వేరియంట్లు సులభంగా వ్యాపిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) జేఎన్.1 వేరియంట్‌ను దాని వేగవంతమైన వ్యాప్తి కారణంగా "వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్"గా వర్గీకరించింది. అయితే ప్రస్తుతానికి "వేరియంట్ ఆఫ్ కన్సర్న్"గా ప్రకటించలేదు.

**లక్షణాలు, తీవ్రత ఎలా ఉన్నాయి?**

ఈ కొత్త ఉపరకాల లక్షణాలు సాధారణంగా గతంలోని ఒమిక్రాన్ వేరియంట్ల మాదిరిగానే ఉంటున్నాయి. గొంతు నొప్పి, తేలికపాటి దగ్గు, అలసట, జ్వరం వంటివి ప్రధాన లక్షణాలుగా కన్పిస్తున్నాయి. అయితే, డెల్టా వంటి పాత వేరియంట్లలో కనిపించిన రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు ఈ కొత్త వేరియంట్ల బారిన పడినవారిలో అంతగా కనిపించడం లేదని వైద్యులు చెబుతున్నారు. చాలా సందర్భాల్లో, ముఖ్యంగా వ్యాక్సిన్లు తీసుకున్న వారిలో, వ్యాధి లక్షణాలు స్వల్పంగానే ఉంటున్నాయని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మాత్రం జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. కర్ణాటకలో ముగ్గురు చిన్నారులకు ఈ కొత్త వేరియంట్ సోకినప్పటికీ, ఎవరికీ ఐసీయూ అవసరం రాలేదని తెలిసింది. ఢిల్లీ ప్రభుత్వం కూడా ముందుజాగ్రత్త చర్యగా ఆసుపత్రులలో పడకలు, ఆక్సిజన్, మందులు సిద్ధం చేసుకోవాలని సూచనలు జారీ చేసింది.

**నిపుణుల అభిప్రాయం**

ప్రముఖ వైరాలజిస్ట్ డాక్టర్ టి. జాకబ్ జాన్ మాట్లాడుతూ, "ఇవన్నీ ఒమిక్రాన్ ఉపరకాలే. ప్రస్తుత పెరుగుదల జేఎన్.1 తదుపరి ఉపరకాల వల్ల వస్తోంది. ఇవి ప్రధానంగా శ్వాసకోశ పైభాగంపైనే ప్రభావం చూపుతాయి. ఊపిరితిత్తులపై ప్రభావం, ఆక్సిజన్ తగ్గడం వంటివి దాదాపుగా ఉండవు. సీజనల్ ఫ్లూ లాగే ఇవి కూడా వస్తూ పోతుంటాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు," అని తెలిపారు. సీనియర్ ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ సునీల్ ఖపర్డే, "వైరస్ తీవ్రత తక్కువగానే ఉంది, దీనిని నియంత్రించవచ్చు. మరణాల సంఖ్య కూడా పెద్దగా లేదు. ముందుజాగ్రత్త చర్యలు ముఖ్యం కానీ, భయపడాల్సిన పనిలేదు," అని అన్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

కొత్త వేరియంట్ల వ్యాప్తి నేపథ్యంలో, ప్రజలు మళ్లీ ప్రాథమిక కొవిడ్ జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా, రద్దీ ప్రదేశాలు, ఇండోర్ సమావేశాలలో మాస్కులు ధరించడం, చేతులను తరచుగా శుభ్రం చేసుకోవడం, అనారోగ్యంగా అనిపిస్తే ఇంట్లోనే ఉండి వైద్య సలహా తీసుకోవడం వంటివి తప్పనిసరి. అధిక ప్రమాదం ఉన్నవారు (వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు) బూస్టర్ డోస్ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని వైద్యారోగ్య శాఖ సూచిస్తోంది. మొత్తంమీద, కొత్త వేరియంట్ల వ్యాప్తి వేగంగా ఉన్నప్పటికీ, వాటి తీవ్రత తక్కువగా ఉండటం, నిపుణులు ఆందోళన వద్దని భరోసా ఇవ్వడం కొంత ఊరటనిచ్చే అంశం. అయితే, వ్యక్తిగత జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చు.

# సముద్రంలో మునిగిన రెండు ఓడలు..
## 427 మంది రోహింగ్యాలు జలసమాధి?

- **మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగి ఘోర ప్రమాదం**
- **427 మంది రోహింగ్యాలు మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా**
- **మే 9, 10 తేదీల్లో ఈ విషాద ఘటనలు**
- **ఇది సముద్రంలో జరిగిన అత్యంత దారుణమైన ఘటనగా ఐరాస ఆందోళన**
- **మయన్మార్‌లోని పరిస్థితుల వల్లే రోహింగ్యాల ప్రమాదకర వలసలు**
- **ప్రాణాలతో బయటపడ్డ కొద్దిమంది, మిగిలిన వారి కోసం గాలింపు**



మయన్మార్ తీర ప్రాంతంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులతో వెళ్తున్న రెండు ఓడలు మునిగిపోయాయి. ఈ ఘోర దుర్ఘటనల్లో సుమారు 427 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని ఐక్యరాజ్య సమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వార్త నిజమైతే, ఇటీవలి కాలంలో సముద్రంలో జరిగిన అతి పెద్ద విషాదాల్లో ఒకటిగా ఇది నిలిచిపోతుందని ఐరాస పేర్కొంది. ఐక్యరాజ్య సమితి అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మే 9వ తేదీన జరిగిన మొదటి ప్రమాదంలో ఒక నౌక మునిగిపోయింది. ఇందులో ప్రయాణిస్తున్న 267 మందిలో కేవలం 66 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడి ఉంటారని తెలిపింది. మిగిలిన వారు గల్లంతయ్యారు. ఆ తర్వాత మే 10వ తేదీన మరో నౌక కూడా ఇదే విధంగా ప్రమాదానికి గురైంది. ఈ రెండో నౌకలో ఉన్న వారిలో 21 మంది మాత్రమే సురక్షితంగా ఒడ్డుకు చేరారని సమాచారం. ఈ రెండు ఘటనల్లో కలిపి మొత్తం 427 మంది మరణించి ఉండవచ్చని ఐరాస అంచనా వేస్తోంది. ఈ ప్రమాదాలకు గల కచ్చితమైన కారణాలపై ఐరాసకు అనుబంధంగా పనిచేస్తున్న శరణార్థి విభాగం విశ్లేషణ జరుపుతున్నట్లు సమాచారం. మయన్మార్‌లో నివసించే రోహింగ్యాలు అనేక సంవత్సరాలుగా వివక్షకు, హింసకు గురవుతున్నారు. 2017లో మయన్మార్ సైన్యం చేపట్టిన కఠిన చర్యల కారణంగా లక్షలాది మంది రోహింగ్యాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు వలస వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అయితే, గత ఏడాది మయన్మార్‌లో సైనిక తిరుగుబాటు జరిగిన అనంతరం, రోహింగ్యాలపై దాడులు, అణచివేత మరింత పెరిగాయని వార్తలు వస్తున్నాయి. దీంతో, బంగ్లాదేశ్‌లోని శిబిరాల్లో ఇప్పటికే కిక్కిరిసిపోయిన జనాభా, అక్కడి దుర్భర పరిస్థితుల కారణంగా అనేకమంది రోహింగ్యాలు ఇతర దేశాలకు వలస వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే, వారు ఏజెంట్ల మాటలు నమ్మి, ప్రమాదకరమైన సముద్ర మార్గాల ద్వారా ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలకు చేరుకోవాలని చూస్తున్నారు. ఇలాంటి ప్రయాణాల్లోనే తరచూ ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

# చదువుల తల్లి .. భక్తులు ప్రణమిల్లి

**0వ రోజూ కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు**
**కాళేశ్వరానికి బారులు తీరిన భక్తులు**
**త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు**
**నదీ తీరంలో పితృ తర్పణాలు**
**26 వ తేదీన ముగియనున్న పుష్కరాలు**



హైదరాబాద్ మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భూపాలపల్లి, ఆంధ్రప్రభ : కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు 10వ రోజుకు చేరుకున్నాయి. శనివారం కూడా పవిత్ర స్నానాలు చేసేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం భక్తులతో కిక్కిరిసిపోతోంది. వేకువ జాము నుంచి మొదలు రాత్రి వరకూ కూడా నదీ తీరం సరికొత్త శోభను సంతరించుకుంది. ఓ వైపున కుటుంబ సభ్యులతో కలిసి పుణ్య స్నానాలు, మరో వైపున త్రివేణి సంగమానికి చీరె, సారె సమర్పించడం, నీటి పక్కన సైకత లింగాలకు పూజలు, వేద పండితుల మంత్రోచ్చారణలతో కాళేశ్వరం అంతా ఆధ్యాత్మికత శోభ ఉట్టిపడుతోంది. నది తీరంలో పూర్వీకులను స్మరించుకుంటూ పితృ తర్పణాలు వదులుతున్నారు. మే 15వ తేదీన ప్రారంభమైన సరస్వతి. పుష్కరాలు 26వ తేదీ సోమవారం నాటితో 12 రోజుల కార్యక్రమం ముగియనుంది.

**కాశీ నుంచి పండితులు**

ఇకపోతే సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరంలో అత్యంత హైలెట్‌గా నిలుస్తోంది త్రివేణి సంగమంలో నిర్వహించే హారతి. హారతి నిర్వహించేందుకు కాశీ నుండి ప్రత్యేకంగా పండితులను తీసుకుని వచ్చారు. వీరు రోజు రాత్రి త్రివేణి సంగమ తీరాన నిర్వహిస్తున్న హారతి తంతు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయితే కాశీ గంగలో నీటి ప్రవాహంపై బోట్లలో కూర్చుని తిలకించాల్సిన పరిస్థితి ఉంటుంది. కానీ కాళేశ్వరంలో నది తీరం 3 నుండి 4 కిలో మీటర్ల మేర విస్తరించి ఉండడంతో నీటి ప్రవాహం మినహాయిస్తే మిగతా ప్రాంతమంతా కూడా ఇసుక మాత్రమే ఉంటుంది. దీంతో భక్తులు అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండానే త్రివేణి సంగమంలో ఉంటూ హారతిని వీక్షించే అవకాశం కల్పించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రతి రోజు సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తులు ఇంటి నుంచి లైవ్ చూడవచ్చు. కలెక్టర్ రాహుల్ శర్మ ప్రతి రోజు హారతి కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మూడు రోజులుగా వర్షం కురుస్తున్నా హారతి కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. రోజు రాత్రి 45 నిమిషాలకు పైగా నిర్వహించే హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకే పెద్ద ఎత్తున భక్తులు కాళేశ్వరంలో ఉండిపోతున్నారు. హారతి అనంతరం స్వస్థలాలకు తిరుగు ప్రయాణం అవుతున్నారంటే హారతి కార్యక్రమానికి ఎంతో ఆదరణ లభిస్తోంది. ఇకపోతే రోజు కాళేశ్వరం త్రివేణి సంగమంలో నిర్వహించే హారతి కార్యక్రమంతో పాటు శుక్రవారం శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి సన్నిధిలో కాశీ పండితులు హారతి కార్యక్రమం నిర్వహించారు. గర్భాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో కాళేశ్వరం ఆలయ ప్రాంగణమంతా హర హర మహాదేవ శంభోశంకర అంటూ నినాదాలతో మారు మోగింది. కలెక్టర్ రాహుల్ శర్మ సంగమంలో పడవలో ప్రయాణించి రక్షణ ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్నారు. భారీ కేడింగ్ దాటి భక్తులు సంగమంలోకి రాకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.

# వేశ్యలుగా చూస్తున్నారు..

**మిస్ వరల్డ్ పోటీ నుంచి తప్పుకున్న మిస్ ఇంగ్లండ్**

**హైదరాబాద్ %-% మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా కంటెస్టెంట్లకు అనేక పోటీలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా ఓ షాకింగ్ సంఘటన చోటు చేసుకుంది. మిస్ వరల్డ్ పోటీల నుంచి ఓ అభ్యర్థి వైదొలగింది. 74 ఏళ్ల మిస్ వరల్డ్ పోటీల చరిత్రలో కంటెస్టెంట్ ఇలా మధ్యలో వైదొలగడం ఇదే ప్రథమం.**



హైదరాబాద్ మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హైదరాబాద్ వేదికగా జరుగుతున్న మిస్ వరల్డ్ అంతర్జాతీయ పోటీల నుంచి ఒక కంటెస్టెంట్ హఠాత్తుగా తప్పుకుంది. బ్రిటన్‌కు చెందిన మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ అనూహ్యంగా ఈ పోటీల నుంచి వైదొలగింది. ముందు ఆమె వ్యక్తిగత కారణాల వల్ల పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించినప్పటికీ.. ఆ తర్వాత ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు నెట్టింట వాడీవేడి చర్చ నడుస్తోంది. ఆమె స్వదేశం వెళ్లిన తర్వాత పోటీల నిర్వహణ పైన అక్కడి పత్రిక ది సన్ కు ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో సంచలన ఆరోపణలు చేసింది. 24 ఏళ్ల మిల్లా మాగీ, గత ఏడాది మిస్ ఇంగ్లాండ్ టైటిల్ గెలిచింది. దీంతో ఆమె ప్రస్తుతం భారతదేశం, హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనడానికి వచ్చింది.

మరో వారం రోజుల్లో ఫైనల్ పోటీలు నిర్వహించనుండగా.. ఇప్పుడు ఆమె హఠాత్తుగా వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాను పోటీల నుంచి తప్పుకోవడానికి గల కారణాలు వివరించింది మాగీ. మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా పోటీదారులను ఉదయం నుంచి రాత్రి వరకు మేకప్‌తోనే ఉండేలా చేస్తున్నారని.. ఆఖరికి ఉదయం టిఫిన్ చేసే సమయంలో కూడా మేకప్ తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

అంతేకాక కొన్నిసందర్భాల్లో నైట్ డ్రెస్సులతో ఉండాల్సి వస్తుందని సాయంత్రం నిర్వహించే కొన్ని కార్యక్రమాల్లో భాగంగా మేల్ స్పాన్సర్లతో కూర్చోవాల్సి వస్తుందని తెలిపింది. ధనవంతులైన స్పాన్సర్లను అలరించాలంటూ తమ మీద ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించింది. తనని వేశ్యలుగా చూస్తున్నారంటూ మాగీ సంచలన ఆరోపణలు చేసింది. ఈ పోటీ ఉద్దేశం మంచిదే అయినా.. నిర్వహణ పద్దతులు మాత్రం సరిగా లేవని ఆమె చెప్పుకొచ్చింది. తనలో మార్పు కోసం ఈ పోటీలకు వచ్చానని కానీ ఇక్కడి పరిస్థితులు చూసి తాను షాక్ అయ్యానని చెప్పుకొచ్చింది. ఈ విధానం పూర్తిగా తప్పు. మేం ఇలా చేయడానికి రాలేదు. ప్రజలను అలరించడానికి మేం అక్కడ కూర్చునే కోతులం కాదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. మరీ ముఖ్యంగా మహిళలకు తగిన గౌరవం లేకపోవడం తనను బాగా కలచివేసిందని.. అందుకే తాను పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది. మాగీ వ్యాఖ్యలు ప్రపంచ ఫ్యాషన్ వీధుల్లో సంచలనంగా మారాయి. ఇది ఇలా ఉంటే ఆమె ఆరోపణలను పోటీ నిర్వాహకులు తొసిపుచ్చారు%ొ% తమపై దుష్ప్రచారం చేసేందుకు కుట్ర పూరితంగా నిందలు వేస్తున్నారంటూ ఆమె వ్యాఖ్యాలను ఖండించారు. ఇక మిల్లా మాగీ ఈ పోటీ నుంచి వైదొలగడంతో ప్రస్తుతం ఆమె స్థానంలో మిస్ లివర్‌పూల్ అయిన 25 ఏళ్ల షార్లెట్ గ్రాంట్ మిస్ వరల్డ్ ఫైనల్‌లో పాల్గొంటున్నారు. ఈ ఫైనల్ ఈ వారం ప్రపంచవ్యాప్తంగా 180 దేశాల్లో ప్రసారం కానుంది. మే 31న హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ 2024 ఫైనల్ పోటీ అంగరంగ వైభవంగా జరగనుంది.

# రాహుల్ గాంధీకి నాన్ బెయిలబుల్ వారెంట్

**పరువునష్టం కేసులో జారీ చేసిన జార?ండ్ చైబాసా కోర్టు**
**జూన్ 26న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశం**
**2018 లో అమిత్ షాను ఉద్దేశించి రాహుల్ గాంధీ వ్యాఖ్యలు**
**ఎంపీ- ఎమ్మెల్యే కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ నేత**

లోక్ సభ ప్రతిపక్ష నేత, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి జార?ండ్‌లోని చైబాసా ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2018 నాటి పరువు నష్టం దావా కేసులో ఈ వారెంట్ ఇచ్చింది. జూన్ 26న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని రాహుల్ గాంధీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

**రాహుల్ పై కేసు ఇదే..**

2018లో కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. "హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి కూడా బీజేపీకి అధ్యక్షుడు కాగలడు" అని రాహుల్ వాఖ్యానించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యాఖ్యలు బీజేపీ కార్యకర్తలందరినీ అవమానించేలా ఉన్నాయని, పరువు నష్టం కలిగించాయని ఆరోపిస్తూ బీజేపీ నేత ప్రతాప్ కతియార్ 2018 జులై 9న చైబాసా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం) కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తదనంతర కాలంలో, జార?ండ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పరువు నష్టం కేసును 2020 ఫిబ్రవరిలో రాంచీలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ చేశారు. ఆ తర్వాత మళ్లీ ఈ కేసు చైబాసాలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ అయింది. ఈ కేసును విచారణకు స్వీకరించిన మేజిస్ట్రేట్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేశారు.



**కోర్టుకు హాజరు కాని రాహుల్..**

కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ రాహుల్ గాంధీ విచారణకు హాజరుకాలేదు. దీంతో తొలుత ఆయనపై బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ వారెంట్‌పై స్టే విధించాలని కోరుతూ రాహుల్ గాంధీ జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను 2024 మార్చి 20న హైకోర్టు కొట్టివేసింది. అనంతరం, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా చైబాసా కోర్టు తిరస్కరించింది. తాజాగా, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించిన ప్రత్యేక న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ, జూన్ 26న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

ఆదివారం 25 మే 2025

# పోలవరంలో ఓ మోస్తరు వర్షం



**పోలవరం, మే 24 (తెలుగురాష్ట్రం విలేకరి):** అల్పపీడన ప్రభావంతో పోలవరం మండలంలో శనివారం ఉదయం పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పట్టిసీమ ఎత్తిపోతల పథకం సమీపంలో కళ్ళాలలో ఆరబెట్టిన మొక్కజొన్న పంట తడిసింది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, ప్రగడపల్లి, ఎల్లండీపేట, ఇటుకలకోట, వింజరం, కోం డ్రుకోట పంచాయతీలలో వర్షం కురిసింది. పదవ తరగతి సప్లిమెంటరీ పరిక్షలకు వెళ్ళే విద్యార్థులు ఉదయం కురిసిన వర్షానికి పరిక్షా కేంద్రాలకు వెళ్ళడానికి అవస్థలు పడ్డారు.

# సచివాలయాల తనిఖీలు నిర్వహించిన ఎంపిడిఒ



**పోలవరం, మే 24 (తెలుగురాష్ట్రం విలేకరి):** పోలవరం మండలంలో సచివాలయాలను ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాసబాబు శనివారం తనిఖీలు నిర్వహించారు. పోలవరం సచివాలయంలో ఆధార్ అప్షన్ సర్వేల పనితీరు పరిశీలించారు. గూటాల సచివాలయంలో పలు సర్వేల నిర్వహణ విషయంలో ఎంపిడిఒ సిబ్బందికి పలు సూచనలు చేశారు.కొత్తపట్టిసీమ, పట్టిసీమ గ్రామాల్లో ఆధార్ అప్ డేషన్, పారిశుద్ధ నిర్వహణ, పంచాయతీ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించి కార్యదర్శులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

# సుదర్శన కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి తగ్గిన భక్తుల రద్దీ



**పోలవరం, మే24 : (తెలుగురాష్ట్రం విలేకరి):** పట్టిసీమ సుదర్శన కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల రద్దీ తగ్గింది. ఉదయం నుండి వాతావరణం మేఘావృతమై ఉం డడమేగాక ఓ మోస్తరు వర్షం కురవడంతో పోలవరం, తాళ్ళపూడి, గోపాలపురం మం డలాల నుండి ప్రతి వారం కాలినడకన వచ్చే మహిళా భక్తుల రద్దీ తగ్గింది. ఆలయంలో యధావిదిగా గోత్రనామాలు, విష్ణు సహస్రనామాలు, మహన్యాసపూర్వక అభిషేకాలు పూజలు నిర్వహించారు. వర్షాభావం వలన తొమ్మిది శనివారాల భక్తుల రద్దీ తగ్గినట్లు ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామశర్మ తెలిపారు.

# పేదలకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు

## - ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట, మే 24,(తెలుగురాష్ట్రం విలేకరి)**



వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లబ్ధిదారులకు అందజేసారు. కొత్తపేట మండలం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 15 మంది లబ్ధిదారులకు రూ.23,21,679 విలువైన చెక్కులను పంపిణీ చేసారు. పేదలను అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతం చేయాలి

## - జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి -

## అమలాపురంలో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ప్రారంభం





**అమలాపురం, మే 24, (తెలుగురాష్ట్రం విలేకరి):** వికసిత్ భారత్ స్ఫూర్తితో ఆరోగ్యకరమైన స్వర్ణాంధ్ర సాకారానికి పునాది పడేలా ఈనెల 21వ తేదీ నుంచి యోగాంధ్ర మాసోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, జిల్లాలో సమష్టి భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి పిలుపునిచ్చారు. శనివారం అమలాపురం జిఎంసి బాలయోగి స్టేడియంలో సుమారు 100 మంది మాస్టర్ ట్రైనీలతో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ థీమ్ ఆధారిత యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకొని మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాను నేర్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం యోగా ట్రైనర్ల సేవలను ఉపయోగించుకోనున్నామన్నారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు . ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ట్రైనర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. యోగాంధ్ర నిర్వహణలో కోనసీమ జిల్లాను ఆదర్శవంతంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేద్దామన్నారు. దేశ ప్రధాని చొరవతో యోగా విశ్వవ్యాప్తమైందని, ఐక్యరాజ్యసమితి తీర్మానంతో తొలిసారిగా 2015, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయని, ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ప్రధానమంత్రి హాజరు కానున్నారని చెప్పారు. మన భారతీయ వార సత్వ, సాంస్కృతిక సంపద అయిన యోగాను ప్రతిఒక్కరూ ఆచరించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేలా ప్రోత్సహించేందుకు జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు థీమ్ ఆధారిత యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు, కళాకారులు, రైతులు, విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు, మాజీ సైనికులు, విభిన్న ప్రతిభావంతులు, లాయర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ శ్రామికులు, అంగన్వాడీ, హెల్త్ వర్కర్లు, వైద్యులు, మత్స్యకారులు, కాలేజీ విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, స్వాతంత్ర్య సమరయోధులు, దేవస్థాన ఉద్యోగులు, ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగులు, సెలబ్రిటీలతో రోజువారీగా థీమ్ ఆధారిత 45 నిమిషాల పాటు యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాచరణను జీవితాంతం తమ జీవనశైలిలో భాగం చేసుకొని ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకొని గ్రామ, వార్డు మండల స్థాయిలో యోగాపై వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పథక సంచాలకులు, ఇన్చార్జ్ డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు , జిల్లా ఆయుష్ వైద్య అధికారి విజయ్ కుమారి, యోగా ట్రైనర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మందపల్లి శనీశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తజనం

## - శని త్రయోదశి సందర్భంగా విశేషంగా తైలాభిషేకాలు



**కొత్తపేట, మే 24,(తెలుగురాష్ట్రం విలేకరి)** కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం శని త్రయోదశి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునుంచి ఆలయ ప్రాంగణంలో భక్తులు శనిదోష నివారణకు తైలాభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. తైలాభిషేకాల ద్వారా రూ.4,10,260, ఆన్లైన్ పరోక్ష పూజల ద్వారా రూ.3,71,200, అన్న ప్రసాద విరాళాలుగా రూ. 41,433 వెరసి.8,22,893 ఆదాయం వచ్చిందని డీసీ చక్రధరరావు తెలిపారు.

# ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి

## - కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రేషన్ డీలర్లు





**కొత్తపేట, మే 24,(తెలుగురాష్ట్రం విలేకరి)**

బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యల్లో భాగంగా రేషన్ వాహనాలను రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి మద్దతుగా పలువురు రేషన్ డీలర్లు శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలసి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ అని చెప్పి రేషన్ వాహనాలు ఏర్పాటు చేసినా అవి ఏదో ఒక ఏరియాలో ఉండి మాత్రమే రేషన్ ఇచ్చేవారని లబ్ధిదారులు వాహనం వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వచ్చేదని వారు చెప్పారు. వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక కూలి పనులు చేసుకునే వారు పని మానుకుని వేచి చూస్తూ ఉండేవారని గుర్తు చేసుకున్నారు. అదీకాక రేషన్ వాహనాల వల్ల ప్రభుత్వానికి అధిక ఖర్చు తప్ప ప్రయోజనం పెద్దగా లేదన్నారు.ఈ వాహనాలు రాక మునుపు రేషన్ డీలర్ల వద్ద ఏ సమయంలో కావాలంటే ఆ సమయంలో తెచ్చుకునే వెసులుబాటు ఉండేదన్నారు.అధిక శాతం ప్రజలు రేషన్ దుకాణాల వద్దే సరుకులు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు.రేషన్ డీలర్లకు పూర్వ వైభవం తెచ్చిన కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే సత్యానందరావు ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

# కోనసీమలో వైఎస్సార్‌సీపీ సమన్వయ భేటీ.




**రావులపాలెం, మే 24(తెలుగురాష్ట్రం విలేకరి)** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి స్వగృహంలో పార్టీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, పిఎసి సభ్యులు పినిపే విశ్వరూప్, తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు పొన్నాడ సతీష్ కుమార్, గొల్లపల్లి సూర్యారావు, పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాశ్, గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నేతలు చర్చించారు. నాయకత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కార్యకర్తలు పని చేయాలని, పార్టీ విజయాన్ని సాధించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com

అమలాపురం
మే 25,
ఆదివారం 2025



## అందుబాటులో ఉండే పశు వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే అంజిబాబుకు వినతి



భీమవరం మే 24, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

భీమవరం పట్టణంలో పశువుల ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా వైద్యులను నియమించాలని సేవ్ ది కోవ్స్ సంస్థ, గో సంరక్షణ అధ్యక్షులు సుంకర దాసు కోరారు. శనివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కు వారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆవులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయని అన్నారు. రాత్రి సమయంలో ఏమైనా ప్రమాదాలు జరిగినా లేక ప్లాస్టిక్ వంటి ప్రమాదకరమైన వ్యర్ధ పదార్థాలు, విష పూరితమైన ఆహారం తినడం వల్ల అవి రాత్రి సమయంలో చాలా ఇబ్బంది పడుతున్నాయని, ఆ సమయంలో ఏ పశువైద్యునికి ఫోన్ చేసినా స్పందించడం లేదని, దయచేసి భీమవరం ప్రాంతంలో సాయంత్రం 5 గంటల నుండి రాత్రి సమయంలో కూడా ప్రత్యేకమైన పశువైద్యున్ని నియమించాలని కోరుతున్నామని అన్నారు.

## రాజ్యసభ సభ్యులు పాక ను సత్కరించిన చైతన్య భారతి నాటక పరిషత్



భీమవరం మే 24, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

ఈనెల 28న డిల్లీలో రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయనున్న పాక సత్యనారాయణను భీమవరం చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు వారి నివాసంలో కలిసి సత్కరించారు. ఎంతోకాలంగా క్రమశిక్షణతో బీజేపీ పార్టీలో సేవలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి సత్యనారాయణ రాజ్యసభ సభ్యునిగా నియమితులు కావడం ఎంతో సంతోషకరమని చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, కాట్రెడ్డి సత్యనారాయణ, పేరిచర్ల లక్ష్మణ వర్మ అన్నారు.

## అక్రమ సంబంధం అనుమానంతో సన్నిహితుని హత్య

### -పశ్చిమలో కిడ్నాప్ .. తూర్పుగోదావరి జిల్లాలో హత్య... ఇద్దరు ముద్దాయిల అరెస్టు... డిఎస్పీ జయసూర్య




భీమవరం మే 24, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకుని దొంగతనం చేశాడన్న అనుమానంతో యాళ్ల కోటేశ్వరరావు( బాబీ) అనే ఆటో డ్రైవర్, బొమ్మల వ్యాపారి, తనకు సన్నిహితుడైన మరో ఆటోడ్రైవర్ కాటూరి దుర్గారావు (28)ను హత్య చేశాడని భీమవరం డిఎస్పి రావూరి గణేష్ జయసూర్య తెలిపారు. శనివారం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలను తెలిపారు. చినరంగని పాలెంకు చెందిన దుర్గారావు ఈనెల 4వ తేదీ నుండి కనిపించకుండా పోయాడని తమకు లభించిన సమాచారం మేరకు దుర్గారావు సోదరుడు నాగరాజును పోలీస్ స్టేషన్ కు పిలిపించి మాట్లాడడంతో ఫిర్యాదు చేశాడన్నారు. కొన్నిఏళ్ల క్రితం అతని భార్య దుర్గారావును విడిచిపెట్టి పుట్టింటికి వెళ్ళిపోయిందని అప్పటి నుండి మృతుడు ఒంటరిగానే ఉంటున్నాడని డిఎస్పీ తెలిపారు. రెండు ఏళ్ల క్రితం దుర్గారావుకు అదే ప్రాంతంనకు చెందిన యల్లా కోటేశ్వరరావు (బాబీ)తో పరిచయం ఏర్పడిందని, కోటేశ్వరరావు కూడా తన మొదటి భార్య నుండి విడిపోయాడని అనంతరం షేక్ మేరీని వివాహం చేసుకున్నాడన్నారు. ఈనెల 4న నాగరాజు తన భార్యకు దశదినకర్మ జరుగుతున్న సందర్భంగా కోటేశ్వరరావు అతని కుమారుడు జాన్ లు అక్కడికి వచ్చి దొంగతనం ఆరోపణలతో దుర్గారావును వారితోపాటు తీసుకెళ్లారన్నారు. దుర్గారావును తమ నివాసమునకు తీసుకువెళ్లి దుర్గారావుపై తీవ్రంగా దాడి చేశారన్నారు. దుర్గారావు కాళ్లు చేతులు కట్టేసి నోటిలో గుడ్డలు పెట్టి ఆటోలో రావులపాలెం సమీపంలోని వెదురేశ్వరం తీసుకువెళ్లారని, అక్కడ నుంచి శవాన్ని మూటతో సహా కోటిపల్లి కాలవలో పడవేసి ఇంటికి వచ్చేసారన్నారు. మృతదేహాన్ని పోలీసులు గుర్తించి అక్కడే పంచనామా, పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ప్రథమ ముద్దాయి కోటేశ్వరరావు, హత్యతో ప్రమేయం ఉందని భావించిన షేక్ మేరీని అరెస్టు చేసామన్నారు. మూడవ ముద్దాయి మైనర్ కావడంతో దానికి సంబంధించి విచారణ చేస్తున్నామని డిఎస్పి జయసూర్య తెలిపారు. హత్యకు వినియోగించిన రాడ్, సుత్తి, సంచి, మృతుడి సెల్ ఫోన్ లను ప్రదర్శించారు. వన్ టౌన్ సీఐ నాగరాజు, ఎస్సై కృష్ణాజీ పాల్గొన్నారు.

## జూన్ 1 సినిమాలు బంద్ లేదు

### -తెలుగు సినీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యుడు, తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అత్తి సత్యనారాయణ (అనుశ్రీ)



రాజమహేంద్రవరం, మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

సినిమా పరిశ్రమను దెబ్బతీయడా నికి నైజం సినీ వ్యాపారం చేసే కొంతమంది పెద్దలు రాజకీయాలు చేస్తున్నారని, ఇటువంటి కుట్ర రాజకీయాలు తెలుగు సినిమా అభివృద్ధిని కుంటుపరుస్తా యని తెలుగు సినీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యుడు, తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిబ్యూటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అత్తి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సినిమాల ప్రదర్శనలు బంద్ చేస్తామని ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. స్థానిక సాయి కృష్ణ థియేటర్లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు రేట్ల సమస్య చాలా కాలంగా నడుస్తుందని దీనిపై సంబంధిత వర్గాల మధ్య చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. ఈ సమస్య మధ్యలోనే కొంతమంది నైజాం సినీ వ్యాపారులు, పెద్ద నిర్మాతలు నలుగురు కలిసి ఆంధ్ర సినీ వ్యాపారాన్ని వారి చేతుల్లోకి తీసుకొని కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నైజాం సినీ వ్యాపారానికి, ఆంధ్ర సినీ వ్యాపారానికి ధరల విషయంలో చాలా వ్యత్యాసం ఉందని, రెండింటి పరిస్థితులు వేరు వేరు అన్నారు. హైదరాబాద్ కేంద్రంగా నలుగురు నిర్మాతలు సిండికేట్గా ఏర్పడి సినిమా వ్యాపారాన్ని సినిమా థియేటర్లను తమ గుప్పెట్లో ఉంచుకునేందుకు ఆంధ్ర సినీ వ్యాపారాన్ని దెబ్బతీయడానికి ఆంధ్రాలోని డిస్ట్రిబ్యూటర్లను, ఎగ్జిబిటర్లను పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. తెలుగు సినిమా పరిశ్రమ వ్యయ్యం విపరీతంగా పెరిగిపోవడానికి హీరోలకు పాన్ ఇండియా పిచ్చి పట్టుకోవడం, మూడు సంవత్సరాలకు ఒక చిత్రం, అగ్ర హీరోలు అగ్ర నిర్మాతల చేతుల్లో బంధీలుగా మారడం, తెలుగు సినీ పరిశ్రమంలోని అన్ని స్థాయిల్లోని కార్మికుల జీవనోపాధి దెబ్బతిందని విశ్లేషించారు. గతంలో చిన్న సినిమాలకు థియేటర్లు ఇచ్చేందుకు చిన్న నిర్మాతలకు అనుకూలంగా ఉండేదని, వందల కోట్ల వ్యయంతో సినిమా హీరోలకు రెమ్యూనరేషన్ ఇవ్వడం, సినిమాలను నిర్మించడం, ప్రభుత్వాల సైతం రేట్లు కేటాయించడం, ఓటిటిలో సినిమాలు అమ్ముకోవడం కారణంగా తెలుగు సినీ పరిశ్రమ దెబ్బతిందన్నారు. ఆంధ్రప్రదేశ్లో ముఖ్యంగా గోదావరి జిల్లాలో మారిన కాలానికి అనుగుణంగా పర్సంటేజీలు పెంచితే పరిష్కారమయ్యే సమస్యను నైజాంనకు చెందిన నలుగురు పెద్దలు త్వరలో విడుదలయ్యే హరిహర వీరమల్లు సినిమాను దెబ్బతీయడానికి కుట్ర చేశారని ఆరోపించారు. తెలుగు సినిమా పరిశ్రమకు చెందిన వ్యక్తి, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి ఎంతో మేలు చేస్తున్నారని, అయన సినిమాను దెబ్బతీయడానికి నైజాం పెద్దలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి జిల్లాలకు సంబంధించి జూన్ 1వ తేదీన సినిమా హాల్లు బంద్ పాటించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జోక్యం చేసుకొని తెలుగు సినిమా పరిశ్రమతో సంబంధం ఉన్న నిర్మాతలు, డిస్టిబూటర్లు ఎగ్జిబిటర్లతో ప్రభుత్వ అధికారులతో సంయుక్తంగా కమిటీని వేసి సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## లలిత కళలతోనే సామాజిక చైతన్యం

### - భీమవరంలో సంస్కార భారతి జిల్లాశాఖ ప్రారంభం .. బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం మే 24, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించుకోవాలని, లలిత కళలతోనే



సామాజిక చైతన్యమని సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు డా చేగొండి సత్యనారాయణ మూర్తి అన్నారు. భీమవరం ఛాంబర్ అఫ్ కామర్స్ భవనంలో కళా సంస్థలు, సంగీత, సాహిత్య, కవిత, ఆధ్యాత్మిక రంగాల వారి సమక్షంలో శనివారం సంస్కార భారతి జిల్లాశాఖను ప్రారంభించి సంస్కార భారతి బ్రోచర్ ను ఆవిష్కరించారు. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 1981లో ఆగ్రా కేంద్రంగా ప్రారంభమైన సంస్కార భారతి గత నాలుగు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా వందలాది శాఖలతో విస్తరించిందన్నారు. లలిత కళల ద్వారా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న భారతీయ సేవా సంస్థ సంస్కార భారతి అని అన్నారు. గన్నాబత్తుల శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి, ఆరేటి ప్రకాష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు భావితరాలకు కళల ద్వారా తెలియజెప్పాలని సంస్కార భారతి చేస్తున్న ప్రక్రియ అని అన్నారు. భీమవరంలో అన్ని రంగాల వారితో ఒక సంస్కార భారతి శాఖను ఏర్పాటు చేస్తామని అన్నారు. భీమవరంలో త్వరలో అన్ని పాఠశాల, కళాశాలలో సంస్కార భారతి యూనిట్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాంజీ, యర్రంశెట్టి వెంకటరత్నం, టివివి ప్రసాద్, జవ్వాది శ్రీనివాస్, రచయిత తెన్నేటి లక్ష్మి నారాయణ మూర్తి, కలిగొట్ల గోపాలశర్మ, సంగీత విద్వాంసులు పిప్పళ్ల ప్రసాద్, కాగిత వెంకటరమణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, ఎస్ కె చాన్ భాషా, రాము, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి మాతృ

ఆలమూరు, మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)





మూర్తి చిత్ర పటానికి నివాళు లు అర్పించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు గారు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు గారు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ గారు, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు గారు, ఆశెట్టి ఆదిబాబు గారు మరియు తదితరులు పాల్గొన్నారు

## ఆర్ అండ్ బి యార్డు దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం

### -ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్





రాజమహేంద్రవరం, మే 24(తెలుగురాష్ట్రం ప్రతినిధి):

రాజమండ్రిలోని ఆర్ అండ్ బి కంపోస్టు యార్డు సమీపంలోని ప్రజలు దశాబ్ద కాలంగా ఎదుర్కొంటున్న దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. రూ. 5.72 కోట్లతో పేపర్ మిల్లు ఎదురు రోడ్డులోని డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన లెగసీ వ్యర్థాల నిర్వహణ (వేస్టు మేనేజ్మెంటు) ప్లాంట్ ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ...బయో ట్రీట్మెంట్ అయ్యాక చిన్న వ్యర్థం కూడా ఉండదని అన్నారు. రాష్ట్రం, కేంద్రం, నగరపాలక సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ప్లాంట్ ఏర్పాటు ఆరునెలల్లో పూర్తవుతుందని, అక్టోబరు 2 నాటికి స్థానిక 42, 45, 46 వార్డుల ప్రజలు దుర్వాసన నుంచి ఉపశమనం పొందుతారని అన్నారు. కాకినాడ మాదిరి రాజమండ్రిలో కూడా జిందాల్ తో ఒప్పందం చేసుకుంటామని, ఇప్పటికేప్రభుత్వంతో ఎంవోయూ అయిందని, మంత్రి నారాయణ ఆరు ఎకరాల్లో దీని కోసం చర్యలు చేపడుతున్నారని ఆయన చెప్పారు. కమిషనర్ దృష్టి సారించారని, ఇది అమలు జరిగితే సాయంత్రం ఇళ్ళలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించి ట్రీట్మెంట్ చేస్తారని ఆయన తెలిపారు. క్వారీ ప్రాంతంలోని చౌడేశ్వరి నగర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆర్.అండ్ బి సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాలును గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఇప్పుడు రూ. 50 లక్షలతో తిరిగి బాగు చేయిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలోని 5 వేల మంది ప్రజలకు ఉపయోగపడే విధంగా రైతు బజారు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యోగ శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి.



భీమవరం మే 24, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

జిల్లా నందు గ్రామ స్థాయి వరకు ప్రజలకు యోగాను సరైన క్రమ పద్ధతిలో బోధించేలా యోగ శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కి రాహుల్ కుమార్ రెడ్డి తెలిపాను. యోగాంధ్ర సాధన లక్ష్యంగా ప్రారంభించిన యోగా మంత్లో భాగంగా 100 మంది మాస్టర్ ట్రైనీలకు యోగా శిక్షణా కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా శనివారం స్థానిక ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆడిటోరియం నందు ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా 100 మందికి జిల్లా వ్యాప్తంగా శిక్షణ యోగా నిపుణులతో శిక్షణను ఇప్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అంశాన్ని ప్రాక్టికల్ గా శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. మీరు క్రమ పద్ధతిలో నేర్చుకున్నది గ్రామస్థాయిలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, వారికి సరైన శిక్షణను అందించినప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. గ్రామస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ఒక్కో సచివాలయం పరిధిలో 7 గురిని ఎంపిక చేసి, వీరికి ఆదివారం శిక్షణా కార్యక్రమాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. వీరి ద్వారా బ్యాచ్కు 50 మంది చొప్పన గ్రామాల్లో విడతల వారీగా యోగా శిక్షణా కార్యక్రమం జరుగుతుందనీ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేయనున్నారు. దీనిలో భాగంగా మండలాలు, మున్సిపాల్టీల్లో భారీ ఎత్తున ర్యాలీలు ఏర్పాటు చేయాలన్నారు. దీనిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# ఎన్టీఆర్ జిల్లాలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుపై నెట్టెం హర్షం



**జగ్గయ్యపేట, మే 24 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో మరో కీలక మలుపుగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగయ్యపేట నియోజకవర్గాల్లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు కోసం 2000 ఎకరాల భూమి కేటాయించడం శుభ సంకేతమని తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ డిఫెన్స్ హబ్ రాష్ట్రానికి అధునాతన సాంకేతికత, విదేశీ పెట్టుబడులు మరియు వేలాది ఉపాధి అవకాశాలను తీసుకురానుందని వెల్లడించారు. "ఈ క్లస్టర్ ద్వారా యువతకు శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పడి, పరిశ్రమలలో చేరేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది. మేధావులు, యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు ఇది ఒక గోల్డెన్ ఛాన్స్," అని రఘురామ్ పేర్కొన్నారు. ఇది కేవలం రాష్ట్ర పారిశ్రామిక రంగానికే కాకుండా దేశం మొత్తానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషిని ప్రశంసిస్తూ, వ్యూహాత్మక ప్రణాళిక రూపకల్పనలో ఇది కీలక దశ అని తెలిపారు. జగ్గయ్యపేట%-%నందిగామ నియోజకవర్గాలకు ఈ అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "ఎన్టీఆర్ జిల్లా ప్రజల తరఫున సీఎం చంద్రబాబుకు మనఃపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని రఘురామ్ అన్నారు.

# పంచాయితీ వర్కర్స్ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



**రాజానగరం, మే 24 (తెలుగు రాష్ట్రం విలేకరి):** దివాన్ చెరువు పంచాయితీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ )అనుభందం యూనియన్ అధ్యక్షులు అక్కిరెడ్డి గణపతి అధ్యక్షతన దివాన్ చెరువు సీఐటీయూ ఆఫీసు నందు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి బి. వి.ఎన్.పూర్ణిమ రాజు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల మార్చి, ఏప్రిల్ రెండు నెలల వేతనాలు ఇవ్వకుండా ఉండటం చాలా దారుణం అని వెంటనే మీ నెల జీతం తో కలిపి 3 నెలల జీతం జూన్ 1 వ తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయితీ పారిశుధ్య కార్మికులు గత 30 సంవత్సరాలుగా పని చేస్తున్న వీరికి ఈఎస్ఐ, సౌకర్యం లేకపోవడం చాలా బాధాకరం అని, కనీస వేతనాలు కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, అందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, లీవు , సౌకర్యాలు కల్పించాలని, పనిలోకి జోళ్ళు, కొబ్బరినూనె, సబ్బులు ,గ్లౌస్ లు, వర్షాకాలం రైన్ కోట్లు ఇవ్వాలని, తుక్కు ట్రాక్టర్లు పాడై పోయి కార్మికులకు కాళ్ళకు గాయాలు అయ్యి ప్రాణపాయస్థికి చేరుకున్న వైద్యసహాయం అందించక పోవడం అన్యాయమని వేమగిరి పెద్ద రాంబాబుకు వైద్యాఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమా వేశం లో యూనియన్ నాయకులు తాళ్ళపూడి మంగా, వెమగిరి సతీష్, మల్లరపు వసంతాలు, నీలపు గౌరీ, మందపల్లి విజయ్, గాలంకి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటకు డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు



**జగ్గయ్యపేట, మే 24 (తెలుగురాష్ట్రం విలేకరి):** జగ్గయ్యపేట పట్టణం ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ జగ్గయ్యపేట నందిగామ మధ్యలో డిఫెన్స్ క్లస్టర్ మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ కి, మంత్రి నారా లోకేష్ కి, దీని ఏర్పాటు కోసం కృషి చేసినటువంటి ఎంపీ కేశినేని చిన్నికి ధన్యవాదములు తెలిపారు. జగ్గయ్యపేట చుట్టుపక్కల గ్రామాలలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని దాని యందు ఇండస్ట్రీస్ నెలకొల్పాలని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి లేఖను సమర్పించడం జరిగింది. ఆ లేక ద్వారా 2015వ సంవత్సరంలో జగ్గయ్యపేటలో చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రభుత్వ భూములను ప్రభుత్వం మొదటిసారిగా సర్వే చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి జగ్గయ్యపేట చుట్టుప్రక్కల వేలాది ఎకరాల భూములు ఉన్నవని గతంలో కూడా దీని మీద ఇండస్ట్రియల్ ఏర్పాటు చేయాలని చెబుతూ మరల వారికి లేఖను ఇవ్వడం జరిగినది. వారు దానికి స్పందిస్తూ వెంటనే దీన్ని త్వరితగతిన చూడాలని క్రింది స్థాయి అధికారులకు సూచించారు. జగ్గయ్యపేట సర్వేనెంబర్ 93 నందు 498.93 సెంట్లు పరిశ్రమలకు కేటాయించాలని ఇండస్ట్రియల్ మినిస్టర్ కి కూడా లేఖను ఇవ్వడం జరిగింది. జగ్గయ్యపేట ను కచ్చితంగా డిఫెన్స్ క్లస్టర్ తీసుకొస్తానని కేసినేని చిన్ని ముందే చెప్పి పలుమార్లు ఈ విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని స్వయంగా కలిసి వివరించడం, మంజూరు చేయించేవరకు కృషి చేయడం జరిగినది. జగ్గయ్యపేట చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను ఎంపీ కేసీనేని చిన్ని జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తో కలిసి పరిశీలించారు. డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గం లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు.

# రేషన్ డీలర్లకు కూటమి ప్రభుత్వం అండ




**జగ్గయ్యపేట, మే 24 (తెలుగురాష్ట్రం విలేకరి):** కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రజాభిప్రాయం చేసి రేషన్ పంపిణీ విధానాన్ని మరల రేషన్ షాపుల ద్వారా ఇచ్చుటకు ప్రభుత్వం తీసుకున్న విధానాన్ని స్వాగతిస్తూ జగ్గయ్యపేట నియోజకవర్గ డీలర్లు పట్టణంలోని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఎప్పుడూ అండగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# నెట్ వర్క్ సేవలు అంతరాయం - వినియోగదారులకు తప్పని ఇబ్బందులు

**దేవీపట్నం, మే 24(తెలుగు రాష్ట్రం విలేకరి):**



దేవీపట్నం మండలం వి.రామన్నపాలెం డియన్.పాలెం సచియాలయాలో ఏపీ ఫైబర్ నెట్ సదుపాయం లేక ఇటు సెల్ నెట్ వర్క్ పని చేయకపోవడంతో సచివాలయనికి వచ్చిన గిరిజన వినియోగదారులు రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు తదితరులు ప్రభుత్వ పనులు మీద వచ్చిన వారికి నెట్ వర్క్ సేవలు అంతరాయంతో పనులు అవ్వక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సచివాలయాలకి రావాలంటే ఇటు వి.రామన్నపాలెం సచివాలయనికి చొప్పకొండ పంచాయతీ వినియోగదారులు అటు డియన్.పాలెం సచివాలయానికి గంగవరం వినియోగదారులు సుమారు 10కిలోమీటర్లు మేరకు నడిచి రావాలి లేకుంటే ఆటో ఖర్చులు నిమిత్తం రానుపోను సుమారు వంద రూపాయలు అవుతుంది. గత ఐదు రోజులు నుండి రోజు సచివాలయానికి రావడం నిరాశతో తిరిగి వెళ్లడం ఇదే వ్యవహారం కొనసాగుతుంది. రోజు కూలినలి చేసుకుని జీవనం సాగిస్తున్న గిరిజనులు ఆటో ఖర్చులకు సగం డబ్బులు తగలేస్తే జీవనం ఎలా కొనసాగించాలి అని వాపోతున్నారు. ఇప్పటికయినా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయంలో ఎటువంటి నెట్ వర్క్ సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని గిరిజన వినియోగదారులు కోరుతున్నారు.

# ప్రతిరోజూ యోగాతో ఆరోగ్యం

## -ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం

**రంపచోడవరం, మే 24 (తెలుగురాష్ట్రం విలేకరి):**



ఏజెన్సీలోను ప్రజలందరూ ప్రతిరోజు యోగా చేసి ఆరోగ్యకరంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఛాంబర్లో వివిధ పాఠశాలలకు సంబంధించిన యోగ మాస్టర్ ట్రైనర్లు అయినటువంటి ఫిజికల్ డైరెక్టర్లతో యోగ విధివిధానాలపై ప్రాజెక్ట్ అధికారి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రపంచంలో యోగాకు మంచి గుర్తింపు ఉందని పంచాయతీ, మండలం, డివిజన్ కేంద్రం పరిధిలో జూన్ నెల 21వ తారీకు వరకు యోగ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. మాస్టర్ ట్రైనర్లతో ఆయా మండలాలలో ప్రజలందరికీ యోగ పై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఏజెన్సీలోను గ్రామపంచాయతీ కార్యదర్శులకు, మండల పరిషత్ అధికారులకు అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు యోగ దినోత్సవం పురస్కరించుకొని ఎక్కడికి అక్కడ యోగా కార్యక్రమాలు నిర్వహించే విధంగా జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం డివిజన్ యోగాకు మంచి గుర్తింపు వచ్చే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది కలసికట్టుగా యోగ కార్యక్రమా నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, యోగ మాస్టర్ ట్రైనర్లు అయినటువంటి కె.తిరుపతిరావు, కె మంగయమ్మ, కె. భవాని, కృష్ణారావు, చిన్న పోతురాజు, సుజిత కుమారి, శశి కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులతో జనసంద్రంగా మారిన సత్య దేవుని సన్నిధి...



**అన్నవరంలో మే 24 (తెలుగు రాష్ట్రం విలేకరి):** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధి నూతన వధూవరులతో ఆలయ ప్రాంగణం అంతా జనసంద్రంగా మారింది. వైశాఖ మాసం అంటే నే పెళ్లిళ్ల కు సీజన్ రాష్ట్రంలో ఎక్కడ పెళ్లిళ్లు జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం దర్శనార్థం విచ్చేయడం ఆనవాయితీ. శుక్రవారం రాత్రి అధిక సంఖ్యలో పెళ్లిళ్లు అవ్వడంతో వేకువజాము 4 గంటల నుంచి నూతన వధూవరుల తోపాటు భక్తులు తో వ్రత మండపాలు కిక్కిరిసాయి. వ్రతం అనంతరం క్యూలైన్లో దర్శనానికి వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు తగు సూచనలు సూచించారు.

# శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ. 2,00,116/-లు విరాళం...



**అన్నవరంలో మే 24 (తెలుగు రాష్ట్రం విలేకరి):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహింపబడుతున్న శ్రీ సత్యదేవ నిత్య అన్నదాన పథకానికి విజయవాడ చెందిన సాయిబాబు%ు%వెంకట సత్యవాణి రూ. 2,00,116/- లు విరాళంగా దేవస్థానం కార్య నిర్వహరణ అధికారి వారికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను దేవస్థానం కార్యనిర్వహరణ అధికారి వారు అభినందించారు..

# వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే శిరీష దేవి



**దేవీపట్నం, మే 24(తెలుగు రాష్ట్రం విలేకరి):** దేవీపట్నం మండలం పాముగండి గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోసు లచ్చన్న దొర (అచ్చిబాబు) వీరాయమ్మ దంపతుల ఆత్మీయ ఆహ్వానం మేరకు వారి చిన్న కుమారుడు సత్యనారాయణ వివాహానికి రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు దేవీపట్నం మండలం టీడీపీ అధ్యక్షుడు మద్రిశెట్ల వెంకటేశ్వరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు లంక హరి చంద్రుడు, కళ్ళ సత్యంరాజు, లంక పోసిరావు, అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మామిడి సీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం..

## -సమస్యల పరిష్కారానికై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా: ఎమ్మెల్యే ఆనందరావు గారు



**అమలాపురం, మే 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ప్రజల సమస్యలకు సరైన పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గారు అన్నారు.అమలాపురం క్యాంపు కార్యాలయం వద్ద ఆనందరావు గారు ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం మార్గం చూపేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు.నేడు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో వినతులు వచ్చినట్లు తెలిపారు.సమస్యలను బట్టి వాటి పరిష్కార సమయం ఉంటుందని అన్నారు.ప్రజలు ఇచ్చిన సమస్యల వినతులు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఎమ్మెల్యే ఆనందరావు గారు తెలిపారు.

# టీమ్ఇండియా
# టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

ముంబయి:
భారత టెస్టు క్రికెట్‌లో కొత్త శకం ప్రారంభమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ వారసుడిగా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. అందరూ భావించినట్లుగానే టెస్టు జట్టు కెప్టెన్సీ పగ్గాలను గిల్‌కు అప్పగించింది. ఈ మేరకు వచ్చే నెలలో ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్ఇండియా జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. సారథిగా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను తీసుకుంది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది.



**టీమ్ ఇండియా జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్.

**కోహ్లీ స్థానంలో ఆ ఇద్దరిలో ఒకరు..**

సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌తోనే టెస్టుల్లో ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇక, కరుణ్ నాయర్ 8 ఏళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో అడుగుపెడుతున్నాడు. చివరిసారిగా అతడు 2017 మార్చిలో టెస్టు మ్యాచ్ ఆడాడు. టెస్టు ఫార్మాట్‌కు కోహ్లీ రిటైర్మెంట్ ఇవ్వడంతో నంబరు 3లో ఎవరు వస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఆ స్థానంలో సాయి సుదర్శన్ లేదా కరుణ్ నాయర్‌ను తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. గాయంతో బాధపడుతున్న షమీతో పాటు శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌కు జట్టులో చోటు దక్కలేదు.

# బుమ్రా అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు

## బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్

టీమ్ఇండియా ఇంగ్లండ్ టూర్ ఐపీఎల్ ముగిసిన అనంతరం జూన్ 20న ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా భారత్ అయిదు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నేపథ్యంలో బుమ్రా అతడి ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్ కారణంగా అన్ని మ్యాచులూ ఆడలేడని బీసీసీఐ చీఫ్ కోచ్ అజిత్ అగార్కర్ తెలిపాడు.




'భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్‌తో జరగనున్న అన్ని మ్యాచ్‌లను ఆడగలిగే స్థితిలో లేడని ఫిజియోథెరపిస్టులు చెప్పారు. దీంతో అతడు కొన్ని మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటాడు' అని అజిత్ అగార్కర్ అన్నాడు. అలాగే శుభ్‌మన్ గిల్‌కు టెస్టు జట్టు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం గురించి కూడా మాట్లాడాడు. 'మేం గత సంవత్సరం నుంచి శుభ్‌మన్ గిల్‌ను పరిశీలిస్తున్నాం. మా అంచనా ప్రకారం అతడు టీమ్‌ను అద్భుతంగా లీడ్ చేయగలడు. టీమ్ఇండియాకు కెప్టెన్ అంటే చాలా తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. అయినా వాటిని తట్టుకుని రాణిస్తాడనే నమ్మకం మాకుంది' అని అజిత్ అగార్కర్ మీడియాతో అన్నాడు.

భారతజట్టులో స్థానం దక్కని మహ్మద్ షమీ విషయాన్ని కూడా ప్రస్తావించాడు. 'జట్టు అవసరాలు తీర్చగలిగేంత పూర్తి ఫిట్‌నెస్‌తో షమీ లేడు. ఇంగ్లండ్ టూర్‌కు అతడు అందుబాటులో ఉంటాడని మేం అనుకున్నాం. కానీ దురదృష్టవశాత్తు అలా జరగలేదు' అని అజిత్ అగార్కర్ ముగించాడు.

# ఈ ఓటమి మంచిదే!: జితేశ్ శర్మ

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా శుక్రవారం లఖ్‌నవూ వేదికగా ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోరులో ఆర్సీబీ ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. దీనికి బదులుగా ఆర్సీబీ 19.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది.




ఈ పరాజయం గురించి ఆర్సీబీ తాత్కాలిక కెప్టెన్ జితేశ్ శర్మ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. 'ఈ ఓటమి మంచిదే' అని ప్రస్తావించాడు. అయితే ఈ ప్రకటన అతన్ని ఇబ్బందుల్లో పడేసేలా ఉండడంతో, టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ రవిశాస్త్రి ఆ ప్రమాదం నుంచి జితేశ్‌ను రక్షించే ప్రయత్నం చేశాడు. 'నాకు తెలుసు ప్లేఆఫ్స్‌నకు ముందు ఈ ఓటమి ఓ మేలుకొలుపు. లోపాలు సరిదిద్దుకొని, ముఖ్యమైన మ్యాచుల్లో తిరిగి పుంజుకునే అవకాశం ఇస్తుంది' అని రవిశాస్త్రి సవరణ చేశాడు. 'కొన్నిసార్లు ఓడిపోవడం మంచిదే. మనలోని లోపాలను విశ్లేషించుకొని ముందుకుసాగడానికి అవకాశం లభిస్తుంది' అని జితేశ్ శర్మ కొనసాగించాడు.

'మేం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు 20 నుంచి 30 పరుగులు అధికంగా ఇచ్చాం. వాళ్లు పవర్‌ప్లేలో చక్కగా బ్యాటింగ్ చేశారు. వారి అటాకింగ్ బ్యాటింగ్‌కు నా దగ్గర సమాధానం లేదు. మొదటి ఆరు ఓవర్లలో మా బౌలర్లు తేలిపోయారు. అయినా.. మిడిల్, డెత్ ఓవర్లలో చక్కగా బంతులు సంధించారు' అని జితేశ్ శర్మ ఆర్సీబీ బౌలర్ల ఆటతీరు గురించి విశ్లేషించాడు. అలాగే టిమ్ డేవిడ్ గాయం విషయాన్ని కూడా ప్రస్తావించాడు. 'అతడి గాయంపై నాకు ఏవిధమైన సమాచారం లేదు. నేను ఔట్ అయిన తర్వాత కాస్త బాధలో ఉండిపోయాను' అని ముగించాడు.

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ ఓటమి పాలైంది. ఇది పాయింట్ల పట్టికలో ఆ జట్టు రెండో స్థానం చేజిక్కించుకునే అవకాశాలపై ప్రభావం చూపింది. ప్రస్తుతం ఆ టీమ్ పంజాబ్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగే మ్యాచ్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంది.

# ఇషాన్ కిషన్‌ను హైదరాబాద్ తర్వాతి సీజన్‌కు రిటైన్ చేసుకుంటుంది

## టామ్ మూడీ



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య శుక్రవారం లఖ్‌నవూ వేదికగా మ్యాచ్ జరిగింది. ఈ పోరులో హైదరాబాద్ జట్టు 42 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 20 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛేదనలో 189 పరుగులకే చేతులెత్తేసింది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 48 బంతుల్లో 98వి పరుగులు చేశాడు. ఇలా కీలక ఇన్నింగ్స్ ఆడి, హైదరాబాద్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో టీమ్ మాజీ కోచ్ టామ్ మూడీ ఇషాన్ కిషన్‌ను ప్రశంసల్లో ముంచెత్తాడు.

'ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌కు ముందు తీవ్ర ఒత్తిడితో ఉండి ఉంటాడు. ఈ సీజన్‌లోనూ ఇప్పటి వరకు సరిగా ఆడలేదు. కానీ ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో ఎంతో ధైర్యంతో, అద్భుతంగా ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. దూకుడుగా బ్యాటింగ్ చేసి, జట్టు భారీ స్కోర్ సాధించేందుకు కృషి చేశాడు. నాకు తెలిసినంత వరకు వచ్చే సీజన్‌లోనూ ఇషాన్ కిషన్‌ను హైదరాబాద్ యాజమాన్యం కచ్చితంగా రిటైన్ చేసుకుంటుంది' అని టామ్ మూడీ తన అభిప్రాయం వ్యక్తం చేశాడు.

ఆర్సీబీకి లీగ్ దశలో మరో మ్యాచ్ మిగిలి ఉంది. బెంగళూరు జట్టు మే 27న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది.

# స్లో ఓవర్‌రేట్ కారణంగా పాట్ కమిన్స్, రజత్ పటీదార్‌కు ఫైన్





ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా శుక్రవారం లఖ్‌నవూ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో స్లో ఓవరేట్ కారణంగా పాట్ కమిన్స్, రజత్ పటీదార్‌కు ఫైన్ పడింది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీకి తాత్కాలిక కెప్టెన్‌గా జితేశ్ శర్మ వ్యహరించాడు. అయినప్పటికీ ఐపీఎల్ రూల్స్ ప్రకారం నియమిత కెప్టెన్ అయిన రజత్ పటీదార్‌కే ఫైన్ పడింది.

ఈ సీజన్‌లో ఇలా జరగడం ఆర్సీబీకి ఇది రెండోసారి. అంతకుముందు ఏప్రిల్ 7న జరిగిన మ్యాచ్‌లోనూ ఆర్సీబీ కెప్టెన్ ఇలాగే ఫైన్ చెల్లించాల్సి వచ్చింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రజత్ పటీదార్ కెప్టెన్‌గా వ్యవహరించలేదు. జితేశ్ శర్మ తాత్కాలిక సారథిగా బాధ్యతలు నిర్వహించాడు. అయినప్పటికీ ఐపీఎల్ నియమనిబంధనల ప్రకారం జట్టు నియమిత కెప్టెన్ అయిన రజత్ పటీదార్‌కు 24 లక్షల రూపాయల అపరాధ రుసుం విధించారు. సరిగ్గా ఇదే సంఘటన ఈ సీజన్‌లో సంజుశాంసన్‌కు ఎదురైంది. ఒక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు రియాన్ పరాగ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయినప్పటికీ స్లో ఓవరేట్ కారణంగా సంజుశాంసన్‌కే ఫైన్ పడింది. ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ కూడా మొదటి తప్పు కింద రూ.15 లక్షల ఫైన్ చెల్లించాల్సి వచ్చింది.

'ఏదైనా జట్టు రెండోసారి స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడితే మొదటిసారి కన్నా ఎక్కువ ఫైన్ కట్టాల్సి వస్తుంది. పటీదార్‌కు రూ.24 లక్షల ఫైన్, ఇంపాక్ట్ ప్లేయర్‌తో కలిపి, జట్టులోని సభ్యులు రూ.6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం.. వీటిలో ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ఫైన్ రూపంలో చెల్లించాల్సి వస్తుంది' అని ఐపీఎల్ అధికారులు వివరించారు.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# మనవరాళ్లపై మోహన్ బాబు ఆసక్తికర ట్వీట్



మంచు మోహన్ బాబు విష్ణు కలసి ఎంతో పట్టుదలతో రూపొందించిన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప విడుదల తేదీ దగ్గరపడుతోంది. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.మూవీ విడుదల దగ్గరపడడంతో ప్రచార కార్యక్రమాలకి వేగం పెరిగింది. ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలు, పోస్టర్లు ప్రేక్షకులలో ఆసక్తి రేకెత్తించాయి. విజువల్స్‌తో పాటు కథపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ చిత్రంతో మోహన్ బాబు మనవరాళు అరియానా, వివియానా తొలి అడుగులు వేస్తున్నారు. మంచు విష్ణు కుమార్తెలుగా సినిమాలోకి ఎంట్రీ ఇస్తున్న వీరి పోస్టర్లు ఇప్పటికే వైరల్ అయ్యాయి. మనవరాళ్లపై మోహన్ బాబు ఆసక్తికర ట్వీట్ శ్రీకాళహస్తి స్థలపురాణం చెప్పనున్న వీరుతాజాగా మోహన్ బాబు ఒక ఆసక్తికర అప్‌డేట్ షేర్ చేశారు. "కన్నప్ప" చిత్రంలో భాగంగా, శ్రీకాళహస్తి స్థలపురాణాన్ని వివరించే లిరికల్ వీడియోను మే 28న విడుదల చేయనున్నట్టు తెలిపారు. దీనిని అరియానా, వివియానా స్వయంగా గాత్రం అందించారన్నది విశేషం.మోహన్ బాబు ట్వీట్‌తో అభిమానుల్లో ఉత్సాహం"నా మనవరాళ్లు ఈ వీడియోకి గాత్రం అందించడం గర్వకారణం శ్రీకాళహస్తి స్థలపురాణం మే 28న వస్తోంది. హర్ హర్ మహాదేవ్," అంటూ మోహన్ బాబు ట్వీట్ చేశారు. ట్వీట్‌తో పాటు వారి లిరికల్ వీడియో పోస్టర్‌ను కూడా షేర్ చేశారు.ఈ పౌరాణిక చిత్రాన్ని బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నారు. ప్రభాస్ అతిథి పాత్రలో కనిపించనుండగా, మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి స్టార్స్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.విజువల్స్, వీఎఫ్ఎక్స్, మ్యూజిక్‌కి ప్రత్యేక ఆకర్షణ కన్నప్ప సినిమాలో విజువల్స్ హై లైట్‌గా ఉండబోతున్నాయి. డివైన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథలో విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ కీలకంగా నిలవనున్నాయి. సంగీతానికి సైతం మంచి స్పందన లభిస్తోంది.ఇది మంచు కుటుంబం ఎంతో ప్రేమగా చేసిన చిత్రం. ప్రేక్షకుల్లోను దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. మోహన్ బాబు కుటుంబం నుంచి మరో తరం ఎంట్రీ ఇవ్వడం వల్ల, ఈ మూవీకి ఎమోషనల్ కనెక్షన్ ఎక్కువగా ఉంది.



# జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ లేదు: దామోదర ప్రసాద్



జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల బంద్ లేదని తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రకటించింది. సినిమా ప్రదర్శనలు యధావిధిగా కొనసాగుతాయని ఫిలిం ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ చెప్పారు. మే 24న డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో నిర్మాతలు భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడిన దామోదర ప్రసాద్.. సమస్యలపై మే 30న కమిటీ వేస్తున్నామని చెప్పారు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇండస్ట్రీ కోసం కలిసి పనిచేయాల్సిందేనన్నారు. ఎవరికి వారు ఊహాజనిత వార్తలు ప్రచారం చేస్తున్నారని.థియేటర్ల బంద్ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని సూచించారు దామోదర ప్రసాద్. త్వరలోనే చిత్రపరిశ్రమలో అన్ని వర్గాలను కలిసి సమస్యలను పరిష్కరించుకుంటామని చెప్పారు. కొన్ని సమస్యలను త్వరలోనే సినిమాటో గ్రఫి మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి చర్చిస్తామన్నారు.

# తెలుగు చిత్ర పరిశ్రమపై పవన్‌కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు



ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ తెలుగు చిత్ర పరిశ్రమపై సంచలన వ్యాఖ్యలు చేశారు. . ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా సినిమా సంఘాల ప్రతినిధులు సీఎంను కలిశారా ? సినీ పెద్దలు, అగ్రనటులను వైసీపీ ప్రభుత్వం ఎలా చూసిందో, ఎన్ని ఇబ్బందులు పెట్టిందో మరిచిపోయారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మా అసోసియేషన్ మరిచినట్లున్నాయని ఎద్దేవా చేశారు. ఇకపై వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని అన్నారు. తెలుగు చిత్రసీమ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌నకు కృతజ్ఞతలు అంటూ పవన్ కల్యాణ్ కార్యాలయం శనివారం సాయంత్రం ప్రకటనను విడుదల చేసింది తమ ప్రభుత్వం వ్యక్తులను కాదు. సినీరంగం అభివృద్ధినే చూస్తుందని వెల్లడించారు.అందరూ కలిసి రావాలన్న సూచనలకు సానుకూలంగా స్పందించలేదని ఆరోపించారు. ఏపీలో రూ. కోట్ల పెట్టుబడులతో నిర్మించే చిత్రాలను ప్రోత్సాహిస్తామని చెప్పాం. సృజనాత్మక వ్యాపారంలో ఉన్నవారి గౌరవానికి భంగం వాటిల్లకూడదని చెప్పామని , కొన్ని సినిమాల విడుదలకు ముందు టికెట్ల ధరను పెంచామని గుర్తు చేశారు.కాగా పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు విడుదలకు ముందు తమ డిమాండ్ల సాధనకు సినిమా థియేటర్లను మూసివేస్తామని ఎగ్జిబ్యూటర్లు నిర్మాతలను హెచ్చరించిన మేరకు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి.

# బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూత



బాలీవుడ్‌లో విషాదం : ప్రముఖ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూత టాలీవుడ్ లో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ విలన్ ముకుల్ దేవ్ అనారోగ్యంతో కన్ను మూశారు. ముకుల్ దేవ్, బాలీవుడ్, పంజాబీ, దక్షిణ భారత సినిమాల్లో నటించి మెప్పించారు. అంతే కాదు టెలివిజన్‌లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన మే 23వ తేదీ( శుక్రవారం) రాత్రి మరణించారు. ఆయన మరణ విషయాన్ని ఆయన సన్నిహితురాలు, నటి దీపశిఖా నాగ్‌పాల్ ఈ మరణవార్తను సోషల్ మీడియా ద్వారా ధృవీకరించారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ముకుల్ దేవ్‌తో ఉన్న పాత చిత్రాన్ని పంచుకుంటూ అని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి ముకుల్ దేవ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్నారని, ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో ఐసియూలో చికిత్స పొందుతూ మరణించారని తెలుస్తుంది. ముకుల్ దేవ్ 1996లో "దస్తక్" సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. తెలుగులో రవితేజ హీరోగా నటించిన కృష్ణ సినిమాలో నటించి ఆకట్టుకున్నారు. అలాగే ప్రభాస్ హీరోగా నటించిన ఏక్ విలన్ సినిమాలోనూ నటించారు. అదేవిధంగా సిద్ధం, కేడి, అదుర్స్, బెజవాడ, మనీ మనీ మోర్ మనీ, నిప్పు, భాయ్ సినిమాల్లో నటించాడు. అలాగే హిందీలో "సన్ ఆఫ్ సర్దార్", "ఆర్%ౌ% రాజ్‌కుమార్", "జై హో", "యమ్లా పగ్లా దీవానా" వంటి చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. హిందీతో పాటు, పంజాబీ, బెంగాలీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం చిత్రాల్లో కూడా నటించారు. ఆయన చివరి చిత్రం "అంత్ ది ఎండ్". ఆయన తమ్ముడు, నటుడు రాహుల్ దేవ్ కూడా బాలీవుడ్‌లో నటుడిగా రాణిస్తున్నారు.నటుడిగా, వ్యాఖ్యాతగా, పైలట్‌గా బహుముఖ ప్రతిభాశాలిన్యూఢిల్లీలోని పంజాబీ కుటుంబంలో జన్మించిన ముకుల్ దేవ్ తండ్రి హరి దేవ్ ఢిల్లీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేశారు. ఆయన ద్వారా ముకుల్‌కి ఆఫ్ఘన్ సంస్కృతితో పరిచయం ఏర్పడింది. ఆయన తండ్రి పష్తో, పర్షియన్ భాషలు మాట్లాడగలిగేవారు. ముకుల్ దేవ్ ఇండియాలోని ప్రముఖ పైలట్ శిక్షణ కేంద్రం ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉరాన్ అకాడమీ నుంచి పైలట్ శిక్షణ కూడా పొందారు. పైలట్‌గానే కాకుండా, నటుడిగా, వ్యాఖ్యాతగా, డ్యాన్స్ ప్రదర్శకుడిగా ముకుల్ దేవ్ తన ప్రతిభను ప్రతిదిక్కూ చాటుకున్నారు. ఎనిమిదో తరగతిలోనే మైఖేల్ జాక్సన్ నృత్యంతో దూరదర్శన్ డ్యాన్స్ షోలో మొదటి పారితోషికం అందుకున్నారు.'దస్తక్'తో వెండితెరకు పరిచయం చిన్న తెరపై పలు విజయాలు నటనపై ఆసక్తితో ముకుల్ దేవ్ ఎనిమిదో తరగతిలోనే తొలి పారితోషికం అందుకున్నారు. దూరదర్శన్ నిర్వహించిన ఓ డ్యాన్స్ షోలో మైఖేల్ జాక్సన్‌ను అనుకరించి ఆయన ఈ గుర్తింపు పొందారు. 1996లో 'ముమ్కిన్' అనే టెలివిజన్ సీరియల్‌లో విజయ్ పాండే పాత్రతో నటనారంగంలోకి అడుగుపెట్టారు. దూరదర్శన్‌లో ప్రసారమైన 'ఏక్ సే బఢ్ కర్ ఏక్' అనే కామెడీ బాలీవుడ్ కౌంట్‌డౌన్ షోలో కూడా ఆయన నటించారు. 'ఫియర్ ఫ్యాక్టర్ ఇండియా' మొదటి సీజన్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఇక సినిమాల విషయానికొస్తే, 'దస్తక్' చిత్రంతో ఆయన సినీ ప్రస్థానం మొదలైంది. ఈ సినిమాలో ఏసీపీ రోహిత్ మల్హోత్రా పాత్రలో ఆయన నటించారు. ఈ చిత్రంతోనే మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ కూడా వెండితెరకు పరిచయమయ్యారు. ముకుల్ దేవ్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# తమన్నాకు కర్ణాటక ఎంపీ తీవ్ర హెచ్చరిక




మైసూర్ శాండల్ బ్రాండ్ అంబాసిడర్ వివాదం తమన్నా నియామకంపై కర్ణాటకలో రాజకీయ తుపాను ఇటీవల కర్ణాటక ప్రభుత్వం ప్రముఖ సినీనటి తమన్నా భాటియాను మైసూర్ శాండల్ వనస్పతి ఉత్పత్తుల బ్రాండ్ అంబాసిడర్ గా నియమించింది. ఈ నిర్ణయాన్ని అధికార వర్గాలు ఎంతో గొప్పగా ప్రకటించినా, ప్రజల మధ్య, ముఖ్యంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత చెలరేగింది. తమన్నా భాటియా దక్షిణభారత సినీ పరిశ్రమలో పాపులర్ అయినప్పటికీ, ఆమెకు కర్ణాటకకు ఎలాంటి బంధం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైసూర్ శాండల్ వంటి చారిత్రకమైన, సంస్కృతిని ప్రతిబింబించే బ్రాండ్‌కు ఒక "బాహ్య నటి"ను అంబాసిడర్‌గా చేయడం అనైతికమని చాలామంది అభిప్రాయపడుతున్నారు.ఎంపీ కృష్ణదత్త ఒడేయర్ ఆగ్రహం "తమన్నా కన్నడ రాదు, ఎలా అంబాసిడర్?"ఈ వివాదానికి మరింత మంటపెట్టినది, బీజేపీ ఎంపీ కృష్ణదత్త ఒడేయర్ తీవ్ర వ్యాఖ్యలు. ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ "తమన్నా భాటియాకు కన్నడ భాష రాదని, కన్నడ సంస్కృతిని ఆమె అనుభవించలేదు. అలాంటి వారిని మైసూర్ శాండల్ బ్రాండ్‌కు ప్రముఖంగా చేయడం సరికాదు" అని అన్నారు. తన పూర్వీకుడు, మైసూర్ శాండల్ కంపెనీ స్థాపకుడైన కృష్ణరాజ ఒడేయర్ 1916లో సంస్థను స్థాపించాడని గుర్తుచేస్తూ, "ఆయన వంశానికి, మైసూర్ ప్రజల గౌరవానికి ఇది అవమానం" అని మండిపడ్డారు.ఇంతకీ, తమన్నా నియామకంపై వ్యతిరేకత కేవలం రాజకీయ వర్గాలకే పరిమితం కాదు. సామాన్య ప్రజల నుంచి కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రాండ్ అంబాసిడర్‌గా 6.2 కోట్ల రూపాయలు వెచ్చించడం అనవసరం అనే విమర్శలతో పాటు, కన్నడ మాట్లాడని వారి ద్వారా స్థానిక సంస్కృతిని ప్రచారం చేయడం ఎంతమాత్రం లాజిక్ కాదని అభిప్రాయపడుతున్నారు.స్థానిక తారలకు అవకాశం ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నకర్ణాటక చిత్రపరిశ్రమలో ఎందరో కన్నడ నటులు ఉన్నా, వారిని ఎందుకు పక్కన పెట్టారన్న ప్రశ్నలూ విస్తృతంగా వినిపిస్తున్నాయి. లోకల్ స్టార్ అయిన రచిత రామ్, శ్రద్ధా శ్రీనాథ్, మేఘనా రాజ్‌లాంటి నటులను ఈ రోలుకు పరిగణించకుండా, బాహ్య రాష్ట్రానికి చెందిన తమన్నాను ఎంపిక చేయడం పట్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. "లోకల్ బ్రాండ్‌కు లోకల్ ముఖమే ప్రతినిధిగా ఉండాలి" అనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం జాతీయతా భావం కాదు, మరియు ప్రాంతీయ గౌరవం, స్థానిక సంస్కృతిని కాపాడతన్న సంకేతం అని పలువురు సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.ఈ వివాదం ప్రభావం ఎటికి దారితీస్తుందో?తమన్నాను అంబాసిడర్‌గా కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎంపీ చేసిన హెచ్చరిక ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచింది. ప్రస్తుతం ఈ వివాదం కర్ణాటకంలో హాట్ టాపిక్‌గా మారింది. సోషల్ మీడియా, టెలివిజన్ చర్చలల్లో ఈ అంశం విస్తృతంగా చర్చకు వస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వం తమ నిర్ణయంపై మళ్ళీ ఆలోచించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఇక తమన్నా భాటియా ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339